Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 146 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 జూన్ 2023 శనివారం పేజీలు : 4

## కంటెంట్ క్రియేటర్స్‌కి యూట్యూబ్ శుభవార్త..

యూట్యూబ్‌లో కంటెంట్ క్రియేట్ చేస్తున్నప్పటికీ తగిన సంఖ్యలో సబ్‌స్క్రైబర్లు లేక ఆదాయం పొందలేకపోతున్న చిన్నచిన్న యూట్యూబ్ ఛానళ్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ వచ్చింది. మోనిటైజేషన్‌కు అవసరమైన సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1000 నుంచి 500లకు తగ్గింది. ఈ మేరకు గూగుల్ సారథ్యంలోని యూట్యూబ్ వెల్లడించింది. దీంతో మోనిటైజేషన్‌కు సంబంధించి కంపెనీ పెద్ద మార్పు తీసుకొచ్చినట్టయ్యింది. తక్కువ సంఖ్యలో ఫాలోయర్స్ ఉన్న యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్ల కోసం మోనిటైజేషన్ విధానాలను మరింత సులభతరం చేయడం, యూట్యూబ్ పార్టనర్ ప్రోగ్రామ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ మార్పులు చేసినట్టు వివరించింది. కాగా గతంలో యూట్యూబ్ పార్టనర్ ప్రోగ్రామ్‌లో జాయిన్ అవ్వాలన్నా, మోనిటైజేషన్ జరగాలన్నా పలు ప్రమాణాలు ఉండేవి. అయితే కొత్త విధానంలో కేవలం 500 మంది సబ్‌స్క్రైబర్లు ఉంటే సరిపోతుంది. గతంలో ఇది 1000గా ఉండేదన్న విషయం తెలిసిందే.




# తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు షురూ!!

## ఎన్నికలకు సమాయత్తమవుతున్న అధికార యంత్రాంగం

హైదరాబాద్ : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను షురూ చేసింది కేంద్ర ఎన్నికల కమిషన్. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది చివరిలోగా జరగనున్న అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం సమాయత్తమైన భారత ఎన్నికల కమిషన్ ఈనెల 22వ తేదీన హైదరాబాద్ కు రానుంది.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అధికారులతో 22వ తేదీ నుండి మూడు రోజులపాటు సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఇక ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వికాస్ రాజ్ పోలీసు డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్, జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎస్పీలతో అసెంబ్లీ ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాలలో పోలీసు, రెవిన్యూ అధికారులదే కీలక పాత్ర అని అన్నారు.

ఎన్నికల సందర్భంగా చెక్ పోస్టుల ఏర్పాటుతోపాటు ఎన్నికల సిబ్బందిని సమాయత్తం చేయాలని తెలిపారు. జిల్లాలలో గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఓటింగ్ తక్కువ జరిగిన నమోదయిన ప్రాంతాల్లో ఓటరు ప్రాముఖ్యత కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. సమస్యాత్మకా ప్రాంతాలలో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రణాళిక రూపొందిచాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు సృష్టించే విధంగా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు సకాలంలో తిప్పికొట్టే విధంగా సోషల్ మీడియా బృందాలను నియమించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ లో ప్రజలకు ఖచ్చితమైన, ప్రామాణికమైన సమాచారం ఇవ్వడం అధికారుల భాద్యత అని అన్నారు. ఎన్నికలలో వివిధ పిర్యాదులను స్వీకరిం చడానికి ఎన్నికల టోల్ ఫ్రీ నెంబర్ 1950 ని కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ లో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే నియోజక వర్గాలను ఆధారంగా లిస్ట్ లను రూపొందించాలని సూచించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేయాలి అని అన్నారు. ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, విధులపై అధికారులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. ఇక మరోవైపు జిల్లాలలోనూ ఎన్నికల సన్నాహాలు మొదలుపెట్టారు అధికారులు.

## పార్టీలకు అతీతంగా ఫిర్యాదులు స్వీకరించండి: కేటీఆర్

హైదరాబాద్: పౌరసేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. పురపాలనలో మరో సంస్కరణకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. కాచిగూడలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒక్కో వార్డులో పది మంది అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలుకు మెరుగైన, సులభమైన సేవలు అందిస్తారని చెప్పారు. ప్రజలు కేంద్రంగా పాలనే తమ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ అన్నారు. ఇకపై వార్డు కార్యాలయాల్లో



కనీస పౌరసేవలు, ఫిర్యాదులు పరిష్కారమవుతాయని చెప్పారు. సిటిజన్ ఛార్టర్‌కు అనుగుణంగా ప్రజలకు సేవలు అందుతాయన్నారు. దేశం మొత్తం మన వైపు చూస్తోందని.. ఈ కార్యక్రమం విజయవంతమైతే దేశంలోని అన్ని చోట్ల నుంచి హైదరాబాద్‌కు వచ్చి నేర్చుకుని వెళ్లే పరిస్థితి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ ఎన్నో రంగాల్లో దేశానికి ఆదర్శంగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా ఫిర్యాదులను స్వీకరించాలని.. తరతమ భేదాలు చూపొద్దని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందిని కేటీఆర్ ఆదేశించారు.

## తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ గా డీకే - సీనియర్ల పక్కా ప్లాన్, రేవంత్ కు చెక్..!?



హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికల వేళ కాంగ్రెస్ హైకమాండ్ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. కర్ణాటక ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణ పైన ఆశలు పెట్టుకుంది. తెలంగాణలో బీజేపీ బలం పెరగకూడదని భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కి ప్రధాన పోటీ దారు తామేనని భావిస్తోంది. ఈ సమయంలో పార్టీలో అంతర్గత విభేదాలకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. పార్టీలోని సీనియర్లకు సన్నిహితుడైన ప్రస్తుత కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కు పార్టీ ఇంఛార్జ్ గా నియమించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. డీకేకు తెలంగాణ బాధ్యతలు:తెలంగాణలో కాంగ్రెస్ కొత్త అస్త్రాలను సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ కు తెలంగాణ పార్టీ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. రాజకీయ వ్యూహాల్లో డీకే కు పట్టు ఉంది. అదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్లకు డీకేతో సత్సంబంధాలు ఉన్నాయి. రేవంత్ నాయకత్వం..విభేదిస్తున్న సీనియర్లు కర్ణాటక ఎన్నికల తరువాత డీకేకు తెలంగాణ బాధ్యతలు అప్పగించాలని ప్రతిపాదించారు. డీకే సమర్ధత పైన నమ్మకం ఉన్న అధిష్ఠానం ఆయన వైపు మొగ్గు చూపుతోంది. ఇతర పార్టీల నేతల చేరితో పాటుగా సీనియర్ల సమన్వయం..ఎన్నికల వ్యూహాల బాధ్యతలను డీకేకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే డీకే సూచనలతో:ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ వ్యూహాలను తిప్పి కొట్టాలంటే తెలంగాణ కాంగ్రెస్ లో సమర్ధవంతమైన నేత కావాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ సమయంలో పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్ది నాయకులను, కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకెళ్లే విధంగా డీకే సేవలు ఉపయోగపడుతాయని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా ఆర్ధిక పరమైన వనరులను సమర్ధంగా ఉపయోగించుకోవాలన్న ఉద్దేశంతో కూడా పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇప్పటికే పార్టీకి చెందిన పలువురు నేతలు డీకేతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ మధ్య టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు, కాంగ్రెస్ పార్టీలోకి రావాలని భావిస్తున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదరరెడ్డి వంటి వారు వేర్వేరుగా బెంగుళూరు వెళ్లి డీకేతో సమావేశమయ్యారు.డీకే హామీతో వారు పార్టీలో చేరేందుకు అంగీకరించారు.

**సమన్వయం..వ్యూహాలు:** డీకే శివకుమార్ నియామకం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని కాంగ్రెస్ అధిష్ఠానం అంచనా వేస్తోంది. పార్టీలో సీనియర్ల మధ్య సమన్వయం కుదరడం లేదు. పార్టీ వే గంగా ముందుకు వెళుతున్న ప్రతిసారీ ఈ అంతర్గత విభేదాలతో తలనొప్పులు ఎదురవుతున్నాయి. మరో పక్క ఇతర పార్టీలకు చెందిన సీనియర్ నేతల చేరికల విషయంలో కూడా తుది నిర్ణయానికి రాలేకపోతు న్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో అధిష్ఠానం ఉన్నట్టు స మాచారం. సోనియా, రాహుల్, ప్రియాంకలతో డీకేకు సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఇక్కడి పార్టీ వ్యవహారాలను ఆయన స్వతంత్రంగా, సమర్ధంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# ఈసారి బీఆర్ఎస్‌లో వీళ్లకు కష్టమేనట?

## గడ్డు పరిస్థితులను ఎదుర్కోనున్న 'మంత్రులు'



హైదరాబాద్ : ముచ్చటగా మూడోసారి గెలుపు బీఆర్ఎస్ కు అంత ఈజీ కాదని తెలుస్తోంది. హ్యాట్రిక్ కొట్టాలన్న బీఆర్ఎస్ కు పరిస్థితులు సానుకూలంగా లేవని అంటున్నారు. టీఆర్ఎస్ చేయిస్తున్న సర్వేల్లోనూ ఎదురీత కనిపిస్తోంది.కొందరు మంత్రులు అయితే గెలవడం కష్టమంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల మూడ్లోకి వెళ్లి ప్రజల మూడ్ను అంచనా వేయడం ప్రారంభించింది. పార్టీ తమ 2023 ప్రచారాన్ని రూపొందించడానికి ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఆ సంస్థ బృందాలు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అవకాశాలపై సర్వే చేస్తున్నాయి. ఈ సంస్థతో పాటు ముప్పై మూడు జిల్లాల అన్ని జిల్లాల ఇంచార్జు కూడా సర్వేలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు మూడు రకాల సర్వేలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ పాలన సంక్షేమ పథకాలు ప్రత్యర్థులు ఎమ్మెల్యేల పని తీరు గెలుపు అవకాశాలపై అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి మూడు నెలలకోసారి సర్వేలు నిర్వహిస్తూనే ఉన్నారు కేసీఆర్. కానీ ఆ తర్వాత తొలిసారిగా అధికార పార్టీకి వ్యతిరేక సంకేతాలు వచ్చినట్టు తెలిసింది. బీజేపీ ఒక్కసారిగా యాక్టివ్గా మారడంతో బీఆర్ఎస్ లో గుబులు రేగుతోంది. కొందరిలో ఆందోళన కూడా మొదలైనట్టు తెలిసింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సర్వే బృందాలు తమ పని తాము చేస్తున్నాయి. ప్రభుత్వ పనితీరుతోపాటు ఎమ్మెల్యేల ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నాయి. ఎమ్మెల్యేలే కాదు.. ఈసారి కొంతమంది మంత్రులకూ తమ నియోజకవర్గాల్లో గటటి పోటీతప్పదని సర్వేల్లో తేలుతోంది. తెలంగాణలో సీఎం కేసీఆర్ ను మినహాయిస్తే 16మంది మంత్రులున్నారు.ఇద్దరు ఎమ్మెల్సీలు కాగా.. 14 మంది ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులయ్యారు.వీరిలో పలువురు గెలవడం కష్టమని అంటున్నారు. వీరు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. సర్వేల్లో వెల్లడవుతున్న సమాచారం ప్రకారం.. ఉత్తర తెలంగాణమంత్రి ఈసారి గెలవడం కష్టమేనంటున్నారు. ఆయన కోటరీ పెట్టుకొని ప్రజలకు దూరంగా ఉంటూ వ్యతిరేకత కొనితెచ్చుకున్నాడట.. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక మంత్రి గతంలో కేవలం 200 లోపు ఓట్లతోనే విజయం సాధించారు. బడుగులు బలహీనవర్గాలకు న్యాయం చేయలేదని.. ఇక తన వర్గానికి పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఈయన చేతిలో ఓడిపోతున్న అభ్యర్థిపై సానుభూతి కూడా వచ్చేసారి ఈయన గెలుపును దూరం చేస్తుందంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మంత్రుల పరిస్థితి కష్టమేనంటున్నారు.ఇక్కడి ఇద్దరు మంత్రులకు గడ్డు పరిస్థితులున్నాయి. పార్టీ నేతలే వారిపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఇద్దరిపై కాంగ్రెస్ బీజేప పోటీదారులే గెలుస్తారని అంటున్నారు. ఖమ్మం మంత్రి పువ్వాడ పరిస్థితి దయనీయమని.. ఆయన పార్టీ మారడం ఖాయమంటున్నారు. గజ్వేల్ లో కేసీఆర్ పై ఈటల పోటీకి దిగితే టగ్ ఆఫ్ ఫైర్ ఖాయమని అంటున్నారు. ఇక సిరిసిల్లలో కేటీఆర్ కు మంచి వాతావరణం ఉంది.. మంత్రి హరీష్ కు తిరుగులేదని అంటున్నారు. అయితే కరీంనగర్ మంత్రి గంగుల కమాలకర్ పరిస్థితి సానుకూలంగా లేదంటున్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా బండి సంజయ్ గెలుపు ఖాయమంటున్నారు. బాల్కొండ నుంచి గెలిచిన మంత్రి ప్రశాంత్ రెడ్డి పరిస్థితికి గట్టి పోటీ తప్పదంటున్నారు. పాలకుర్తి నుంచి గెలిచి ఎర్రబెల్లికి తిరుగులేదని అంటున్నారు. ఇక మంత్రి జగదీష్ రెడ్డికి ఇబ్బందికరంగా ఉందని.. మంత్రి శ్రీనివాసగౌడ్ కు సానుకూలత ఉన్నా ప్రత్యర్థుల నుంచి పోటీ తప్పదంటున్నారు. మంత్రి తలసానికి ఈసారి తేలిక కాదని అంటున్నారు.

ఇక్కడ బీజేపీ బలంగా తయారైందంటున్నారు. వనపర్తి మంత్రి నిరంజన్ రెడ్డికి ఇబ్బంది లేకున్నా.. విజయం తేలికకాదంటున్నారు. మొత్తంగా నలుగురైదుగురు తెలంగాణ మంత్రులు తప్ప మిగతా వారికి గడ్డుకాలమేనని.. ఎమ్మెల్యేల్లో చాలామందికి కష్టమేనంటున్నారు.

# సంపాదకీయం

## తండ్రి కొడుకులు కోరుకున్నవి అసలు ఎందుకు ఇవ్వాలి?

తాము టార్గెట్ చేసిన రాష్ట్రంలో అదే పనిగా సభలు సమావేశాలు కార్యక్రమాల్ని నిర్వహించే అలవాటు బీజేపీకి మామూలే. తెలంగాణను టార్గెట్ చేసిన కమలం పార్టీ.. తాజాగా తెలంగాణకు మోడీషాలు తరచూ వచ్చి పోయే పని పెట్టుకున్నారు. మొన్నటికి మొన్న సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో భారీ సభను నిర్వహించి.. దానికి ప్రధాని నరేంద్రమోడీ హాజరయ్యారు. తాజాగా హైదరాబాద్ శివారు ప్రాంతమైన చేవెళ్లలో నిర్వహించిన బహిరంగ సభను నిర్వహించి.. దానికి మోడీకి నీడ అయిన అమిత్ షా హాజరయ్యారు. రోజుల వ్యవధిలోనే ఈ ఇద్దరుఅగ్రనేతలు నగరానికి రావటం చూసిన వేళ.. తెలంగాణలో అధికారాన్ని బీజేపీ ఎంత సీరియస్ గా తీసుకుందన్న విషయం ఇట్టే అర్థం కాక మానదు. ఇలాంటి వేళ.. మోడీషాలను టార్గెట్ చేసే విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శిస్తుంటే.. మంత్రి కేటీఆర్ మాత్రం మహా దూకుడును ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన.. తెలంగాణకు కేంద్రం ఏమీ చేయట్లేదని మరేమీ ఇవ్వట్లేదంటూ తరచూ విమర్శలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. చేవెళ్ల సభలో అమిత్ షా వ్యాఖ్యల్ని చూసినప్పుడు మంత్రి కేటీఆర్ మాటలకు కౌంటర్ ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. తాము తెలంగాణలో డెవలప్ మెంట్ ప్రోగ్రాంలు చేసేందుకు ముందుకు వస్తున్నా.. కేసీఆర్ సర్కారు తమకు సహకరించటం లేదని మండిపడుతున్నారు. దీనికి బదులుగా మంత్రి కేటీఆర్ ట్వీట్లు చేస్తూ.. "తెలంగాణలో ఐఐఎం ఐఐఎస్ఈఆర్ ట్రిపుల్ ఐటీ ఐఐటీ ఎన్ఐడీ నవోదయ విద్యాలయాలు మెడికల్ నర్సింగ్ కాలేజీలకు అమిత్షా శంకుస్థాపన చేశారు" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించటం ద్వారా.. ఆయనేమీ చేయలేదన్న విషయాన్ని చెప్పే ప్రయత్నం చేశారు. దీనిపై కమలనాథులు విరుచుకు పడుతున్నారు? అసలు తెలంగాణకు కేసీఆర్.. కేటీఆర్ కోరినవి ఎందుకు చేయాలని నిలదీస్తున్నారు. తెలంగాణలో జరిగిన డెవలప్ మెంట్ ను రాజకీయ కోణంలో చూడకుండా అవార్డులు ఇస్తుంటే.. దానికి బదులు కౌంటర్లు వేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. తెలంగాణ బీజేపీ గెలిచిన నియోజకవర్గాలను అస్సలు పట్టించుకోని కేసీఆర్ సర్కారుకు ఇలాంటి మాటలు మాట్లాడే హక్కు ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణకు ఏదైనా చేసినంతనే అదంతా తమ గొప్పేనని.. మెడలు వంచి మరీ తాము సాధించినట్లుగా గొప్పలు చెప్పటం ఎంతవరకు సరైన చర్యా? అని ప్రశ్నిస్తున్నారు. ఎవరు అవునన్నా.. కాదన్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిదంటే.. దానికి కేసీఆర్ చేసిన పోరాటం ఏ మాత్రం కాదని.. సోనియాగాంధీ తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్న పట్టుదల మాత్రమేనని.. దాని గురించి కూడా కేసీఆర్ తప్పుడు భాష్యాలు చెప్పటం.. తమకు అనుకూలంగా మార్చుకొని అధికారాన్ని సొంతం చేసుకున్న విషయాన్ని గుర్తు చేసుస్తున్నారు. రాజకీయంగా వారెంత కఠినంగా ఉంటారో.. ప్రత్యర్థి పార్టీలు అంతే కఠినంగా ఉంటాయన్న విషయాన్ని వారు మర్చిపోకూడదంటున్నారు. తెలంగాణ డెవలప్ మెంట్ గురించి ఇన్నేసి మాటలు మాట్లాడుతున్న కేసీఆర్.. కేటీఆర్ లు.. సగటు జీవికి మేలు చేసే ఎంఎంటీఎస్ రెండో దశ ఆలస్యం ఎందుకు అయినట్లు? అని ప్రశ్నిస్తున్నారు. కేంద్రం తాను ఇవ్వాల్సిన గ్రాంటును ఇచ్చేసినప్పుడు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.300 కోట్లు ఇవ్వకుండా తొమ్మిదేళ్లుగా ప్రాజెక్టును నానబెట్టిన వైనం.. చివరకు కేంద్రమే కల్పించుకొని ఆ నిధుల్ని సర్దుబాటు చేస్తున్న వైనాన్ని గుర్తు చేస్తున్నారు. తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ గుండెలు బాదేసుకోవటం.. సెంటిమెంట్ ను రాజేసి రాజకీయ ప్రయోజనం పొందటమే కానీ.. కేంద్రంతో ఘర్షణ వాతావరణం లేకుండా డెవలప్ మెంట్ మీద ఎందుకు ఫోకస్ చేయట్లేదో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. నిజానికి తెలంగాణ ఈ రోజున ఇంతలా అప్పుల బారిన పడటానికి.. జీతాలు సరైన సమయానికి ఇవ్వకపోవటానికి.. వేలాది కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉండటానికి కారణం కేంద్రమేనా? అని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ డెవలప్ మెంట్ కు తండ్రీకొడుకులు విలన్లు మాదిరి మారారని చెబుతున్నారు. రాజకీయంగా అణగదొక్కేసేలా ప్రవర్తించే కేసీఆర్.. కేటీఆర్ లు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ఏ మాత్రం సరికాదంటున్నారు. తెలంగాణ డెవలప్ మెంట్ జరగాలంటే రాష్ట్రంలో అధికార బదిలీ తప్పనిసరి అంటున్న బీజేపీ నేతలు.. సానుభూతిపరుల మాటలకు ఎంతమేరకు ఓట్లు రాలతాయన్నది ఇప్పుడు ప్రశ్నగా మారిందని చెప్పాలి.

# ఆగని ఇసుక అక్రమ రవాణా



తంగళ్లపల్లి : ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు అక్రమార్కులు అదను చూసి ఇష్టారాజ్యంగా తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. స్థానిక అవసరాల పేరుతో కొందరు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తుండగా, మరికొందరు రాత్రి వేళ అడ్డూ అదుపూ లేకుండా మానేరు వాగు నుంచి తోడేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక అవసరాల పేరిట అనుమతి తీసుకొని ఇసుక స్మగ్లర్లు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ జిల్లా సరిహద్దు గ్రామాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళల్లో సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ వంటి పట్టణాలకు తరలిస్తూ దందాను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు మండెపల్లి, రాళ్లపేట, కస్బెకట్కూర్, గండిలచ్చపేట గ్రామాల శివారులోని మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ కొందరు జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. మరి కొందరు ఇళ్ల వద్దనే డంపు చేసి అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలిస్తున్నారు.

**గ్రామాల్లో లాభసాటి వ్యాపారంగా..**

ఇసుక లాభసాటి వ్యాపారంగా మారడంతో అక్రమార్కులు మానేరువాగు నుంచి తరలిస్తూ గ్రామ శివారుల్లో ఓ చోట డంపు చేస్తున్నారు. సుమారు 15- 20 కిలో మీటర్ల దూరం ఇసుక తరలింపునకు కూలీలు, డీజిల్‌కు ఒక్కో ట్రిప్పునకు రూ.400 నుంచి రూ.700ల వరకు ఖర్చు అవుతుంది. టిప్పర్ యజమానులు ఒక్కో టిప్పు ఇసుకను రూ.1500ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు పోనూ ట్రిప్పునకు రూ.700ల వరకు లాభం రావడంతో గ్రామాల్లో ఎక్కువగా దీనిని వ్యాపారంగా మార్చుకుంటున్నారు. టిప్పరు యజమానులు అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**వేబిల్లులు తీసుకొని..**

స్థానిక అవసరాల పేరిట వేబిల్లులు తీసుకొని సూచించిన స్థానంలో ఇసుకను పోయకుండా జిల్లా సరిహద్దు గ్రామాలైన జిల్లెల్ల, రామచంద్రాపూర్, మల్లాపూర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ వంటి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు వారంలో రెండు సార్లు అంటే బుధ, శనివారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు యథేచ్ఛగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తూ జిల్లా సరిహద్దు గ్రామాల శివారుల్లో నిల్వ చేస్తున్నారు.

**అతి వేగం.. మైనర్లతో డ్రైవింగ్**

స్థానిక అవసరాల పేరిట అనుమతి తీసుకొని మానేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు అతి వేగంగా ప్రధాన రోడ్డుపై వెళ్తున్నారు. దీంతో ఇతర వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. యువకులు కొందరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం పోయిన సంఘటనలు ఉన్నాయి. మరికొందరు మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఇసుకకు అనుమతులు ఇచ్చిన రోజు రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టినట్లయితే కొంత మేరకు ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటాం- సదానందం, తహసీల్దార్, తంగళ్లపల్లి**

స్థానిక అవసరాలకు మాత్రమే అనుమతులు ఇస్తున్నాం. అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించినట్లు మా దృష్టికి రాలేదు. రాత్రి వేళల్లో రవాణా చేయకుండా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# గోదావరి జలం.. పంటలకు ప్రాణం



గంగాధర : యాసంగి సీజన్‌లో అదను దాటినప్పటికీ ఎల్లంపల్లి ప్రాజెక్టు (గోదావరి) జలాలు విడుదల చేయడంతో పంటలకు ప్రాణధారగా నిలిచాయి. ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి ఎల్లంపల్లి ప్రాజెక్టు వెన్నుదన్నుగా ఉంటుండగా రైతులు రెండు పంటలు పండించుకుని కరవు జయిస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం నుంచి రెండు పైపులైన్ల ద్వారా నారాయణపూర్ జలాశయాన్ని నింపుతారు. ఇక్కడి నుంచి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో దాదాపు 1.60 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని దాదాపు 60 చెరువులు, కుంటలు నింపి ప్రధాన, ఉపకాలువల ద్వారా నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. అయితే గతేడాది భారీ వర్షాలకు వరదలతో గంగాధర, నారాయణపూర్ చెరువుల కట్టలు తెగి నీరంతా వృథాగా పోయింది. యాసంగిలో ఎల్లంపల్లి నీటి విడుదలపై సందిగ్ధం నెలకొనగా రైతులు సగం విస్తీర్ణంలో అంటే దాదాపు 80 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారు. అయినప్పటికీ వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోయాయి. 'ఈనాడు' కథనాలతో ప్రభుత్వం నారాయణపూర్ చెరువు కట్ట మరమ్మతులు పూర్తి చేసి మార్చి 10 నుంచి ఎల్లంపల్లి నీరు విడుదల చేసింది.

ఎగువ ప్రాంతాలకు ఎత్తిపోతలు షురూ..నారాయణపూర్ నుంచి ఎడమకాలువ ద్వారా గంగాధర మండలంలోని ఆయా గ్రామాలకు నీరు పంటలకు అందుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రామడుగు మండలంలోని ఆయా గ్రామాలకు మత్తడి దూకుతూ లక్ష్మీదేవిపల్లి-నాగిరెడ్డిపూర్ వాగు ద్వారా పుష్కలంగా నీరు చేరుతోంది. ఇక నారాయణపూర్ నుంచి నాలుగు రోజులుగా కొడిమ్యాల మండలం పోతారం చెరువు నింపి ఇక్కడి నుంచి వాల్వులు విప్పి నాచుపల్లి నాగసముద్రం చెరువు నింపారు. నల్లగొండ, తిప్పాయిపల్లి, బోయినపల్లి మండలంలోని అనంతపెల్లి, కోరెం, వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, శాత్రాజ్‌పల్లి, నూకలమర్రి, చందుర్తి మండలం నర్సింగాపూర్, బండపల్లి గ్రామాలకు నీటిని విడుదల చేసి పంటలకు అందించారు. ఎగువ గ్రామాల్లోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగునీరు అందగా ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నారాయణపూర్ చెరువు మత్తడి పదేపదే తెంపడంతో ఎగువ గ్రామాలకు నీటి విడుదలలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. నీటి విడుదలతో సరాసరిగా పంటలకు నీరు అందగా వ్యవసాయ బావుల్లో జలం పైకివచ్చింది. విద్యుత్తు వినియోగంతోపాటు నీటి వినియోగం తగ్గి రైతులకు శ్రమ తప్పినట్లయింది.

**నాలుగు ఎకరాలు దక్కాయి**

రెండు బావుల ఆధారంగా 8 ఎకరాల్లో వరి పంట వేస్తే బావుల్లో ఊటలు తగ్గి పొలం పారడం కష్టమైంది. ఇప్పటికే ఎకరన్నరలో పంటలు వేయక బీడుగా వదిలేసిన. ఎట్టకేలకు నీటి విడుదల చేయడంతో పోతున్న ప్రాణం తిరిగొచ్చినట్లయింది. లేకపోతే సగం విస్తీర్ణంలో పంటలు ఎండిపోయి పెట్టుబడులు మీద పడే ప్రమాదముంది. 15 రోజులు ముందుగా నీటిని ఇస్తే మిగతా రైతులు నష్టపోయేవారు కాదు.

**కొట్టె రాజయ్య, లక్ష్మీదేవిపల్లినీరు వచ్చినా.. రాళ్ల వాన ముంచింది**

ఎల్లంపల్లి నీరు విడుదలతో పంటలు పండాయనే సంతోషం కూడా వడగళ్ల వాన మిగలకుండా చేసింది. మూడు రోజులపాటు కురిసిన అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, కూరగాయలు దెబ్బతిని కోలుకోలేకపోతున్నాం. 50 శాతం నష్టం జరిగితేనే పరిహారం ఇస్తామని అధికారులు కొర్రీలు పెడుతున్నారు.

మొగిలిపాలెం అంజయ్య, నాగిరెడ్డిపూర్

# అప్రమత్తతే శ్రీరామ రక్ష

గోదావరిఖని : దేశవ్యాప్తంగా 'కరోనా' కేసుల సంఖ్య పెరుగుతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజులుగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. దీంతో స్థానికుల్లో భయాందోళన వ్యక్తమవుతుండగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో 'కొవిడ్ ఐసోలేషన్ వార్డు' ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నారు. కొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో ఆక్సిజన్ సదుపాయం కలిగిన కొవిడ్ ఐసోలేషన్ వార్డు సిద్ధం కానుంది. రెండు పర్యాయాలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కరోనా కేసులు అత్యధికంగానే నమోదు కావడంతో ఆసుపత్రిలోని కొవిడ్ ఐసోలేషన్ వార్డులో అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందించారు. మరోసారి రామగుండం ప్రాంతంలో కరోనా వ్యాప్తి వెలుగు చూస్తుండడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వారం రోజుల్లో ముగ్గురికి..** వారం రోజుల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. స్థానిక పరిశ్రమల్లో పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు తరచూ ఆయా ప్రాంతాలకు వెళ్లి వస్తుండడంతోనే గతంలో ఈ ప్రాంతంలో కరోనా వ్యాప్తి పెరిగింది. ఒక దశలో కళాశాలల నుంచి వచ్చే విద్యార్థుల్లోనూ కరోనా కేసులు నమోదయ్యాయి. తాజాగా స్థానికుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి జ్వరం, జలుబుతో బాధపడుతూ ఓ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకోగా కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. వైద్యులు అవసరమైన మందులు ఇచ్చి పంపించారు. రెండు, మూడు రోజుల క్రితం గోదావరిఖనిలోని రెండు వేర్వేరు కాలనీలకు చెందిన ఇద్దరికి కరోనా సోకినట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రితో పాటు ఈ ప్రాంతంలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ రోజు దాదాపు 25కు పైగా కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**మాస్కులు వాడితే మేలు**కరోనా వ్యాప్తి మొదలైన నేపథ్యంలో ప్రతీఒక్కరు కొవిడ్ నిబంధనలను పాటిస్తే ప్రయోజనముంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించడం, జనం గుమికూడిన స్థలాల్లోకి వెళ్లకపోవడం, తరచూ చేతులను శానిటైజ్ చేసుకోవడం తదితర నిబంధనలను తప్పకుండా పాటించాల్సి ఉంది. కానీ.. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే వారితో పాటు గర్భిణుల రద్దీ ఎక్కువ ఉండడం కలిగిస్తోంది.

# ఎందుకో.. ఏమో.. రసం తగ్గుతోంది

నల్గొండ : నల్గొండ జిల్లా అనగానే ఒకప్పుడు నిమ్మ, బత్తాయి తోటలు గుర్తుకు వచ్చేవి. ఇదంతా గతం. ఒకప్పుడు రెండు లక్షలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో ఉండి ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధికంగా బత్తాయి పంట పండించే జిల్లాగా ఒక వెలుగు వెలిగిన నల్గొండలో.. ఏటేటా ఆ పంట సాగు గణనీయంగా తగ్గుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం 42 వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తుండగా..క్షేత్రస్థాయిలో అది 30 వేల ఎకరాలకు పడిపోయింది. రాష్ట్రంలోనే తొలిసారిగా బత్తాయి మార్కెట్‌ను నల్గొండలో ఏర్పాటు చేసినా.. అందులో కార్యకలాపాలు జరగడం లేదు. మరోవైపు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు, నీటి వసతి పెరగడం తదితర కారణాలతో రైతులు సైతం బత్తాయి పంటను సాగు చేయడానికి ముందుకు రావడం లేదు.

నల్గొండ, కనగల్, చండూరు, గుర్రంపోడు, హాలియా, పెద్దవూర, పీఏ పల్లి, మల్లేపల్లి, నాంపల్లి, మునుగోడు ప్రాంతాల్లో ఒకప్పుడు రైతులంతా బత్తాయినే పండించేవాళ్లు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) కాల్వ వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లోని భూములకు



నీటి వసతి పెరగడం, ఆ తడితో వేరుపురుగు తెగుళ్లు సోకడంతో క్రమంగా బత్తాయి పంట సాగు కనుమరుగవుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న ఐదారేళ్లలో ఉమ్మడి జిల్లాలో సాగు 5 వేల ఎకరాలకు పడిపోవడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా బత్తాయి మొక్కలను నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి దిగుబడులు మొదలవుతాయి. 20 ఏళ్ల వరకు కాపు వస్తుండగా..రైతులు మాత్రం ఏడెనిమిదేళ్లలోనే దిగుబడులు తీసి అనంతరం చెట్లను నరికివేస్తున్నారు.

**అదే దారిలో నిమ్మ**

ఉమ్మడి రాష్ట్రంలోనే నిమ్మ పంటకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న నల్గొండ జిల్లాలో ఆ పంట విస్తీర్ణమూ క్రమంగా తగ్గుతోంది. ఐదేళ్ల క్రితం 45 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నిమ్మ, ప్రస్తుతం 12 వేలకు పడిపోయింది. బహిరంగ మార్కెట్లో ధరలున్నా రైతుకు గిట్టుబాటు ధర తగ్గకపోవడం, అంతుచిక్కని తెగుళ్లు వచ్చి చెట్లు ఎండిపోవడం, గత ఐదారేళ్లుగా నీటి వసతి పెరిగి, వరి పంట సాగుకే రైతులు మొగ్గు చూపుతుండటంతో నిమ్మ సాగు తగ్గుతోంది. ప్రస్తుత పరిణామాలను బట్టి గత చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం నెలకొందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బత్తాయి, నిమ్మ సాగు వైపు రైతులు వెళ్లేలా ప్రోత్సహించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న వాదనలున్నాయి. ఇటీవలే ప్రభుత్వం సైతం నల్గొండ జిల్లాను బత్తాయి క్లస్టర్‌గా ప్రకటించి ఈ పంట సాగు పెరుగుదలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసినప్పుడే బత్తాయి పంటను కాపాడుకోగలమని రైతులు వెల్లడిస్తున్నారు.

**గిట్టుబాటు లేకే**

ఒకప్పుడు నిమ్మలో అద్భుతాలు చేసిన వాళ్లమే. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. తెగుళ్లు, ఇతరత్రా కారణాలతో నిమ్మ నుంచి వచ్చే రాబడి కూలీలకు, ఇతరత్రా ఖర్చులకే వెళ్తోంది. ఏమీ గిట్టుబాటు కావడం లేదు. గతంలో ఉన్న దాని కంటే నీటి వసతి సైతంపెరిగింది. దీంతో సహజంగానే వరిసాగుకు మొగ్గుచూపుతున్నాం. దీంతో నిమ్మ తోటల సాగును తగ్గించాం.

యానాల క్రిష్ణారెడ్డి, నెల్లిబండ, నకిరేకల్ మండలం

**చర్యలు తీసుకుంటున్నాం**

జిల్లాను బత్తాయి క్లస్టర్‌గా ప్రకటించి ఈ పంట సాగు మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. వివిధ కారణాలతో రైతులు బత్తాయి సాగును తగ్గిస్తున్నది వాస్తవమే. ఏ తెగుళ్లు వచ్చినా తట్టుకునే సామర్థ్యమున్న నాణ్యమైన మొక్కలను రైతులకు సరఫరా చేసి తిరిగి వారు బత్తాయి సాగు వైపు మళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. సంగీత లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యాన శాఖ, నల్గొండ

# వెల్లంకిపై మమకారం.. దాతల సహకారం

రామన్నపేట :: రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం దక్కింది. కేంద్రం నిర్దేశించిన 9 అంశాల్లో ఒకటైన స్వయం సమృద్ధి విభాగంలో రెండో స్థానం సాధించింది. గ్రామ సర్పంచి ఎడ్ల మహేందర్‌రెడ్డి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో పాటు సొంత నిధులు వినియోగించి గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈయన స్ఫూర్తితో కొంతమంది దాతలు ముందుకు రావడం తదితర కారణాలతో వెల్లంకి గ్రామానికి రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కింది. 2021-22 సంవత్సరానికి గాను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచి ఎడ్ల మహేందర్‌రెడ్డి అందుకున్నారు. రూ.80 లక్షల వ్యయంతో అధునాతన సదుపాయాలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. రూ.3 లక్షలతో నీటి శుద్ధి కేంద్రానికి గది, వైకుంఠధామంలో రూ.12.50 లక్షల వ్యయంతో గది, రూ.3లక్షలు వ్యయంతో వాణిజ్య సముదాయం వంటి పలు పనులు సొంత నిధులతో చేపట్టారు. రైతు వేదికకు అదనంగా సొంత నిధులు ఖర్చు చేసి హైటెక్ భవనంలా దిద్దారు. హెచ్‌పీసీఎల్ సంస్థ సహకారంతో రూ.20లక్షలు వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. గ్రామంలో హరితహారం కింద నాటిన మొక్కలతో గ్రామంలోని పలు వీధులు పచ్చదనంతో కన్పిస్తాయి. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ కె.నర్సింహులు ఫిబ్రవరి 24న వెల్లంకిని సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర స్థాయిలో పురస్కారాన్ని అందుకోవటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చకచకా ఎల్లంపల్లి పైప్‌లైన్ మరమ్మతులు

కరీంనగర్ : ఎల్లంపల్లి పైప్‌లైన్ మరమ్మతులు చకచకా జరుగుతున్నాయి. అధికారులు ఎట్టకేలకు స్పందించి పనులు చేపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రెండేళ్ల పాటు పంటలు ఎండిపోయి అన్నదాతలు నష్టపోయారు. ప్రస్తుతం పనులు పూర్తయితే అన్నదాతలకు సాగునీటి కష్టాలు తీరుతాయి.వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రంతో పాటు జగిత్యాల జిల్లా కథలాపూర్, మేడిపల్లి, భీమారం మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని రుద్రంగిలోని నాగారం రిజర్వాయర్, రుద్రంగి శివారులో ఉన్న కలికోట సూరమ్మ చెరువులో నింపేందుకు చందుర్తి నుంచి 2018లో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. 2018, 2019, 2020 సంవత్సరాల్లో ప్రతి వేసవిలో నాలుగైదు రోజుల పాటు నీటిని రుద్రంగిలోని నాగారం చెరువు, కలికోట సూరమ్మ చెరువుల వరకు ఎత్తిపోశారు. ఈ పైప్‌లైన్ నుంచి మొత్తం 30 రోజులైనా నీటిని ఎత్తిపోయకుండానే చందుర్తి మండలం లింగంపేటలో 2020లో మరమ్మతులకు గురైంది. 2021 మార్చిలో తాత్కాలికంగా మరమ్మతులు చేసి రుద్రంగిలోని నాగారం చెరువు వరకు మళ్లీ వారం పాటు నీటిని ఎత్తిపోశారు. 2021 వర్షాకాలంలో మళ్లీ పైప్‌లైన్ పాడైంది. అప్పటి నుంచి రుద్రంగికి ఎల్లంపల్లి నీరు ఎత్తిపోయడం నిలిచిపోయింది.



అధికారులు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో అన్నదాతలు సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. పంటలు ఎండిపోయాయి. ఈ సమస్యపైన, అధికారుల నిర్లక్ష్యం వల్ల కర్షకులకు ఏర్పడుతున్న నష్టంపై ఎప్పటికప్పుడు కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు అధికారులు స్పందించి లింగంపేటలో పైప్‌లైన్ మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు చకచకా జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. వానాకాలంలో వర్షాలు కురవకపోతే ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోసి ఆయా ప్రాంతాలకు తరలించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

సంతోషంగా ఉంది

ఎల్లంపల్లి నీరు రుద్రంగి మండలానికి చేరుకోవడానికి ప్రధానమైన పైప్‌లైన్ చందుర్తి మండలం లింగంపేట దగ్గర పాడైపోయి రెండేళు అయింది. అప్పటి నుంచి వచ్చిన రెండు వేసవి కాలాల్లో సాగునీటి కొరత వల్ల పంటలు ఎండిపోయాయి. ప్రస్తుతం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ వానాకాలంలో వర్షాలు సరిగ్గా కురవకపోయినా ఎల్లంపల్లి నీటితో పంటలు కాపాడుకునే అవకాశం ఏర్పడుతుంది.

ఎర్రం గంగ నర్సయ్య, రైతు, రుద్రంగి

రైతులు సహకరించాలి

భవిష్యత్తులో ఎల్లంపల్లి పైప్‌లైన్ మరమ్మతులకు గురికాకుండా ఉండాలంటే పైప్‌లైన్ పరిసరాల్లో ఉన్న రైతుల సహకారం అవసరం. పైప్‌లైన్‌పై ఉన్న ప్రాంతాల్లో మట్టిని తొలగించడం, ఆ ప్రాంతాన్ని ఆక్రమించి పంటలు వేయడం చేస్తే మళ్లీ ఇబ్బందులు ఏర్పడతాయి. ప్రస్తుతం మరమ్మతు పనులు చివరి దశలో ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశిస్తే రానున్న వానాకాలంలో ఎల్లంపల్లి నీటిని నాగారం, కలికోట సూరమ్మ చెరువుల్లోకి విడుదల చేయటానికి సిద్ధంగా ఉంటాం.సంతు ప్రకాశ్, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్టు

# బడి చదువు.. మోత బరువు!

కరీంనగర్ : భావిభారత పౌరులు బడులకు అధిక బరువును మోసుకుంటూ వెళ్తున్నారు. విద్యా బుద్ధులను నేర్చుకునేందుకు మానసికంగా సంసిద్ధమవ్వాల్సిన చోటే.. శారీరకంగా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడువేలకుపైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 4.35 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో దాదాపుగా 70 శాతం మందికి ఈ అధిక బరువు చింత తప్పడం లేదు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఈసారైనా మార్పు వచ్చిందేమోనని సోమ, మంగళవారాలు పరిశీలించగా విద్యార్థులు అధిక బరువు పుస్తకాల సంచీలు మోస్తూ బడికి వెళ్తున్న దృశ్యాలే కనిపించాయి.

ఇవేవీ పట్టవా? చిన్నారులు మోసే పుస్తకాల సంచి భారం వారి బరువులో పదిశాతాన్ని మించకూడదనే నిబంధన ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఈ ఇబ్బంది ఎక్కువని గతంలోనే యశ్‌పాల్ కమిటీ తేల్చినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. పుస్తకాల బరువు తగ్గించాలని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినా ఆచరణలో ఇబ్బంది ఎదురవుతోంది. నాలుగు జిల్లాల పరిధిలో 200కుపైగా బడుల్లో డిజిటల్ తెర చదువులు సాగించాలని నిర్ణయించినా ముందుకు సాగడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో డిజిటల్ బోధన ఉన్నా పుస్తకాల మోత మాత్రం తగ్గడం లేదు.

పదో తరగతి పిల్లల బడి సంచి బరువు గరిష్ఠంగా 5 కిలోలు మించవద్దని విద్యాశాఖ నిబంధన ఉంది. 2017లో తెలంగాణ విద్యాశాఖ క్షేత్రస్థాయిలో పరిశీలించగా ప్రాథమిక స్థాయిలో 6 నుంచి 12 కిలోలు, ఉన్నత పాఠశాల విద్యార్థులు 12- 17 కిలోల పుస్తకాల సంచీలు మోస్తున్నారని గుర్తించి ఇది తగదని ఆదేశాలిచ్చినా ఆచరణకు నోచుకోవడం లేదు.

తల్లిదండ్రులు.. యాజమాన్యాలు ఇలా చేయాలి!

పుస్తకాల సంచీ అధిక బరువుపై తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలతో మాట్లాడి ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టాలి.ప్రతి విద్యార్థి పాఠశాలలో రెండో సంచి ఉంచుకునే అవకాశం ఉండాలి. బడి వరకే అవసరమైన పుస్తకాలు అందులో ఉంచేలా ఏర్పాట్లు చేయాలి.హోంవర్క్ ఇచ్చిన సబ్జెక్టుల నోటు పుస్తకాలు మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా ఉపాధ్యాయులు చూడాలి.సంచి బరువు శరీరంపై సమానంగా ఉండేలా వెడల్పు పట్టీలున్న బ్యాగులను ఎంచుకోవాలి.

అవసరమున్నా లేకున్నా..అయిదారు తరగతులు చదివే విద్యార్థులకే 40 వరకు పుస్తకాలు ఉంటున్నాయి. అందులో రోజూ దాదాపుగా 20 వరకు పుస్తకాలు తీసుకెళ్లాల్సి వస్తోంది. వీటితోపాటు లంచ్‌బాక్స్, నీళ్ల సీసా అదనం. పుస్తక ముద్రణ సంస్థలు ఇచ్చే కమీషన్ల కోసమే అవసరం కన్నా ఎక్కువగా పుస్తకాలు యాజమాన్యాలు కొనసాగిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంవత్సరంలోనైనా పుస్తకాల సంచీ మోతపై ప్రత్యేక దృష్టి పెడితేనే చిన్నారులకు మేలు చేసినవారవుతారు. ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి సోమవారం బడికి వెళ్లేప్పుడు తీసుకెళ్తున్న సంచీ బరువు తూకం వేయగా 7.2 కిలోలు ఉంది. ఆ విద్యార్థి బరువు 31 కిలోలు. మొదటి రోజు సాధారణంగా విద్యార్థులు కొన్ని పుస్తకాలే తీసుకెళ్తారు. మున్ముందు ఈ భారం ఇంకా పెరిగే అవకాశముంది. నిబంధనల ప్రకారం విద్యార్థులు తమ శరీర బరువులో పది శాతాన్ని మించి మోయకూడదు. చాలామంది చిన్నారులు బడి నుంచి ఇంటికి రాగానే నీరసంగా ఉంటారు. కాళ్లు నొప్పిగా ఉన్నాయని, మెడ, వెన్నుభాగంలో ఇబ్బందిగా ఉందని ఆస్పత్రులకు వచ్చే చిన్నారులు చెబుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. పుస్తకాల సంచీ బరువు విషయంలో పట్టించుకోకపోతే యుక్త వయసు వచ్చే సరికి భుజాలు వంగిపోవడం, నిటారుగా నిలబడకపోవడం లాంటి సమస్యలొస్తాయంటున్నారు.వెన్నెముక, నడుము నొప్పి సమస్యలుచిరుప్రాయం నుంచి విద్యార్థులు అధిక బరువు పుస్తకాల సంచీ మోయడం వల్ల భవిష్యత్తులో పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. కండరాలపై అధిక బరువు ప్రభావం పడుతుంది. ఉండే తరగతి గదులకు ఈ బరువు మోస్తూ మెట్లు ఎక్కుతుండటం వల్ల మోకాళ్లపై భారం రెట్టింపు అవుతుంది.

# బయోమెట్రిక్ హాజరు... సీసీ కెమెరాల ఏర్పాటు



గోదావరిఖని : ప్రజావైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వాలు తాజాగా తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేసే ఆచార్యులు, సహాయ ఆచార్యులు తప్పనిసరిగా నిర్ణీత వేళల్లో సేవలందించాల్సి ఉంటుంది. ఆసుపత్రులు, వైద్య కళాశాలల నిర్వహణను మెరుగుపరుస్తూ ప్రజలు, విద్యార్థులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో జాతీయ వైద్య కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో ఆచార్యులు, సహాయ ఆచార్యుల హాజరును బయోమెట్రిక్‌లో నమోదు చేయడంతో పాటు సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు వారి పనితీరును సైతం నేరుగా హైదరాబాద్‌లోని వైద్య విద్య సంచాలకులు, దిల్లీలోని జాతీయ వైద్య కమిషన్ పరిశీలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేస్తారు. ఆచార్యులు, సహాయ ఆచార్యులు ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసుకోవాలి. కళాశాల, ఆసుపత్రి అవసరాల నిమిత్తం బయటకు వెళ్లినా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా కొందరు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు హాజరు నమోదు చేసుకొని ఓ గంట సేపు ఆసుపత్రిలో ఉండి తర్వాత సొంత క్లినిక్‌లకు వెళ్లి తిరిగి నాలుగు గంటలకు వచ్చి బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకునే వారు. ఇకపై ఇలాంటి అవకాశాలు లేకుండా ఆయా వైద్యుల గదులు, కళాశాలల్లోని తరగతి గదుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. దీని ఆధారంగానే వారి జీతభత్యాలు లెక్కించాల్సి ఉంటుంది. రాత్రివేళల్లో ఆసుపత్రుల్లో విధుల్లో ఉండే వైద్యులు ఇళ్లల్లోనే ఉంటూ కేసులు వచ్చాయంటే ఆసుపత్రికి రావడం, లేదంటే ఫోన్ ద్వారానే నర్సింగ్ సిబ్బందితో చికిత్స చేయిస్తున్న సంఘటనలున్నాయి. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేసినప్పటికీ ఉన్నతస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ వదిలేశారు. ప్రస్తుతం జాతీయ వైద్య కమిషన్ నిర్ణయంతో తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిందే.


మిగతా వైద్యులకు సైతం...

జాతీయ వైద్య కమిషన్ పరిధిలోకి వచ్చే ఆచార్యులు, సహాయ ఆచార్యులతో పాటు వైద్య విధాన పరిషత్తునకు చెందిన వైద్యులు, ఆయా ఆసుపత్రుల్లో పనిచేసే సీనియర్ రెసిడెంట్లు, హౌస్ సర్జన్ల పనితీరు పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో అప్పటికే పనిచేస్తున్న వైద్య విధాన పరిషత్తు పరిధిలోని వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు సీనియర్ రెసిడెంట్లు, హౌస్ సర్జన్లు ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లోని సీనియర్ రెసిడెంట్లు, హౌస్ సర్జన్లు పర్యవేక్షకులతో ఒప్పందం కుదుర్చుకొని వారం పదిరోజులకోసారి ఆసుపత్రికి వస్తున్నారనే ఆరోపణలున్నాయి. వైద్యుల్లోనూ ఇలాంటి వారు కొందరు లేకపోలేదు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలంటే ఆసుపత్రుల్లోని అన్ని విభాగాల వైద్యులపై పర్యవేక్షణను కఠినతరం చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలోనే అమలులోకి

బయోమెట్రిక్ పరికరాలు, సీసీ కెమెరాలను బిగించాల్సిన నిపుణులు ప్రస్తుతం సిద్దిపేటతో పాటు కొన్ని చోట్ల పనిచేస్తున్నారు. అక్కడ పూర్తికాగానే గోదావరిఖనిలోని వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో ఏర్పాటు చేస్తారు. వైద్య కళాశాల, ఆసుపత్రి నిర్వహణను ఎప్పటికప్పుడు హైదరాబాద్‌లోని వైద్య విద్య సంచాలకులు, దిల్లీలోని జాతీయ వైద్య కమిషన్ నిరంతరంగా పర్యవేక్షించనున్నారు. వైద్య విధాన పరిషత్తు ఆధీనంలోని బయోమెట్రిక్ పరికరాలు పాడయ్యాయి. కొత్తవి బిగించాం. సంబంధిత నిపుణులు వాటిని బిగించడంతో పాటు సీసీ కెమెరాలను అనుసంధానం చేయాల్సి ఉంది. త్వరలోనే దీనిని పూర్తిచేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల

# రక్త బంధం.. సేవా సుగంధం




కరీంనగర్ : 'నువ్వు దానం చేసే రక్తం జీవన్మరణ సమస్యకు పరిష్కారం చూపుతుంది' అనే సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని అనేక మంది దానం చేసేందుకు ముందుకొస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. కీలక సమయంలో దానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యువకులు వాట్సాప్ గ్రూప్‌లా వేదికగా ప్రచారం చేస్తున్నారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాధితులకు పునర్జన్మనిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిదాయక కథనం.

మూడు నెలలకోసారి శిబిరాలు..

ఉమ్మడి జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ సొసైటీ, వైద్య శాఖ సంయుక్తంగా మూడు నెలలకొకసారి, ప్రముఖుల దినోత్సవాల్లో కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. 18-65 ఏళ్లలోపు ఎవరైనా రక్తం దానం చేయొచ్చని ప్రచారం చేస్తుండటంతో చాలామంది ఉత్సాహం చూపుతున్నారు. విద్యావంతులు, యువకులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి పెద్దఎత్తున రక్త నిల్వలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కేంద్రాల్లో భద్రపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిల్లో 8, ప్రైవేటులో 12, రెడ్‌క్రాస్ సొసైటీ (కరీంనగర్‌లో) 1 చొప్పున రక్త నిల్వల కేంద్రాలు ఉన్నాయి. రెడ్‌క్రాస్ సొసైటీ వారు కొత్త జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నిల్వలు అంతంతే... చైతన్యం పెరగాలి

కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వెయ్యి యూనిట్ల సామర్థ్యముంది. మిగిలిన అన్ని జిల్లాలో 500 యూనిట్లలోపు సామర్థ్యం ఉంది. వాటిలో సామర్థ్యం మేరకు సరిపడా నిల్వలు లేవు. వేసవికాలం కావడం.. జిల్లాలో శిబిరాలు అంతంత మాత్రమే నిర్వహించడం అందుకు ప్రధాన కారణాలు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు చైతన్యవంతమై మరిన్ని శిబిరాలు నిర్వహిస్తే సరిపడా నిల్వలు ఉండే అవకాశముంది.

వాట్సాప్ వేదికగా ప్రచారం

యువకులు, స్వయం సహాయక సంఘాల మహిళలు వాట్సాస్ వేదికలో రక్తదానంపై ప్రచారం నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో నివాసముంటున్న వారిని గ్రూప్‌ల్లో సభ్యులుగా చేర్చుకుంటున్నారు. ఎవరికైనా రక్తం అవసరమైతే ఆయా ప్రాంతాల్లోని సభ్యులకు సమాచారం ఇస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లి రక్తం దానం చేస్తున్నారు. ఇలా చేస్తే ఆరోగ్యం బాగుంటుందని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపల్లి వైబ్రట్ గ్రూప్‌లో ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్‌లో నివాసముంటున్న వారు సభ్యులుగా ఉన్నారు.

తప్పని ఎదురుచూపులు

రక్త ఉత్పత్తుల మార్పిడి ప్రతి ఏటా అనేక మంది జీవితాలను రక్షించడంలో సహాయపడుతోంది. దానం చేయడంతో కొత్త కణాలు ఉత్పత్తి అవుతాయి. మానసిక, ఆరోగ్యం లభిస్తుంది. అయితే అవగాహన రాహిత్యంతో బాధితులకు ఎదురుచూపులు తప్పడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించకపోవడంతో బంధువులు హైరానా పడుతున్నారు. ఓ నెగెటివ్, ఏ నెగెటివ్, బీ నెగెటివ్, ఏంబీ నెగెటివ్ అరుదుగా లభించే నిల్వలు దొరకని పరిస్థితి నెలకొంది. ఒక దశలో ప్రాణాల మీదకు వస్తుంది. నిల్వల కొరత అధిగమించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

# బిల్లుల కుప్పలు.. ఉద్యోగుల తిప్పలు

కామారెడ్డి : ఉద్యోగులకు వేతనాలు అందడం ఆలస్యమవుతోంది. జిల్లాలోని ఉద్యోగులకు 10వ తేదీ నుంచి 15వ తేదీ మధ్యలో వేతనాలు జమ చేస్తున్నారు. తాజాగా ఉద్యోగుల వేతనసవరణ, డీఏ బకాయిల బిల్లులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో మళ్లీ ఖజానా శాఖలో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇతర అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్నవి కూడా తిరస్కరణకు గురైనట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. గృహావసరాలు, ఆసుపత్రి ఖర్చులు, పదవీ విరమణ డబ్బులు, కార్యాలయాల నిర్వహణ వ్యయం ఇలా అన్ని బిల్లులు సకాలంలో ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దారులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. బిల్లులకు ఖజానా శాఖ అధికారులు స్థానికంగా ఆమోదం తెలిపినా.. డబ్బులు మాత్రం రావడం లేదు. వాస్తవానికి ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ కావాలి. జిల్లా వ్యాప్తంగా 180 మంది ఉద్యోగులకు సంబంధించి రూ.10 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడింటికే మోక్షంఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతన సవరణ బకాయిలను ప్రభుత్వం 18 విడతలుగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. చివరగా గత ఏడాది మే, జూన్, జులై నెలల్లో మూడు విడతలుగా బిల్లులు చెల్లించారు. ఇప్పటివరకు మొత్తంగా 11 బిల్లులు చేయగా అందులో మూడింటికి మోక్షం కలిగింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు అందలేదు. మొత్తంగా 8 బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వేతన సవరణ, ఇతర బకాయిల కోసం మళ్లీ డ్రాయింగ్ అధికారులు బిల్లులు సమర్పించాల్సిందేనని కొందరు ఉద్యోగులు పేర్కొంటున్నారు. బకాయిల స్టేటస్ పరిశీలిస్తే తిరస్కరణకు గురైనట్లు స్పష్టంగా తెలుస్తుందని పేర్కొంటున్నారు.

# భగీరథ నీరు ఎప్పుడొస్తుందో?

వేములవాడ: మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో వేములవాడ పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.42 కోట్లు వెచ్చించి పట్టణంలో మిషన్ భగీరథ నీటి పథకం పనులు పూర్తి చేసినప్పటికీ పట్టణవాసులకు తాగు నీటి కష్టాలు తప్పడం లేదు.వేములవాడ పట్టణంతో పాటు పురపాలక సంఘంలోని విలీన గ్రామాలు కలుపుకొని మొత్తం 28 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల్లో తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 44 వేలకు పైగా జనాభా, 13,351 గృహాలున్నాయి. వీరికి అవసరమైన తాగునీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు ఒక రిజర్వాయర్, రెండు సంపులు, ఆరు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు ఉన్నప్పటికీ




పట్టణవాసులకు సరైన సమయానికి నీటి సరఫరా కావడం లేదు. పైపులు లీకేజీ అయిన సందర్భంలో మూడు, నాలుగు రోజులైన రావడం లేదు. నిర్ణీత సమయంలో సరఫరా చేయడం లేదు. దీంతో ఏ సమయంలో నీటి సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి పట్టణ ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

నల్లాలు బిగించక...

పట్టణంలో మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఇందులో చాలా ప్రాంతాల్లో నల్లాలు బిగించక నల్లా పైపు ఇంటి ముందు వదిలేశారు. దీంతో నల్లా నీటిని వదిలినప్పుడు ఈ పైపుల ద్వారా నీరు మురుగు కాలువల్లోకి వెళ్తోంది. అసలే తాగునీటి కోసం పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నల్లాలు బిగించని కారణంగా పెద్ద ఎత్తున నీరు వృథా అవుతుంది. ముఖ్యంగా శివారు కాలనీల్లో పైపులకు నల్లాలు బిగించక భారీగా నీరు మురుగు కాలువల్లోకి వెళుంది. దీనిని అరికట్టాల్సిన మున్సిపల్ సిబ్బంది చోద్యం చూస్తున్నారే తప్పా వృథాకు కళ్లెం వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి సరఫరా విభాగంలో దాదాపు 30 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ సక్రమంగా సరఫరా కాకపోవడంతో పట్టణ ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సక్రమంగా రావడం లేదు

భగీరథ నల్లా నీరు రెండు, మూడు రోజులకు ఒకసారి సరఫరా అవుతుంది. ఎప్పుడు వస్తుందో, ఎంత వరకు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి ఉంది. సక్రమంగా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. రోజూ ఒకే సమయానికి నల్లా నీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. చిలుక శ్రీలత, సుభాష్‌నగర్

ఎదురుచూడాల్సి వస్తుంది

నల్లా నీరు ఏ సమయానికి వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. వేళాపాలా లేకుండా సరఫరా అయ్యే నల్లా నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఒక్కొక్కసారి రెండు, మూడు రోజులైన రావడం లేదు. భగీరథ నీరు తాగడానికి ఉపయోగపడటం లేదు. మళ్లీ శుద్ధజల ప్లాంటు వద్దకు వెళ్లి క్యాన్‌తో నీటిని కొనుక్కోవాల్సి వస్తుంది. పిట్టల అంజలి, సుబ్రహ్మణ్యంనగర్

మరమ్మతుల సమయంలోనే అంతరాయం

ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ పథకం పైపుల లీకేజీ, ఇతరత్రా మరమ్మతుల సందర్భంలో మాత్రమే తాగు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుంది. ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించి తాగు నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. గోనె అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# అతుకుల సుందరీకరణ

కరీంనగర్ : కరీంనగర్ అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది టవర్‌సర్కిల్.. ఆ ప్రాంతం వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది.. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు.. అలాంటి చోటును స్మార్ట్‌సిటీలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు తయారు చేశారు. అమృత్‌సర్ తరహాలో దీనిని అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టారు. రూ.26 కోట్లు కేటాయించగా ఆ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయి. రహదారులు, ఫుట్‌పాత్, విద్యుత్తు దీపాలు, రాత్రిపూట ప్రత్యేకంగా లైటింగ్, టవర్ సర్కిల్ నలువైపుల రోడ్డుపై టైల్స్ వేసి తీర్చిదిద్దారు.

సాగదీత.. నిర్లక్ష్యం

టవర్‌సర్కిల్ వ్యాపార కూడలి. అలాంటి చోట పనులు చకచకా పూర్తి చేయాల్సి ఉండగా మూడేళ్ల నుంచి సాగదీస్తున్నారు. ఇప్పటికీ ఆ పనులు పూర్తి చేయకపోగా, ఎక్కడ పడితే అక్కడ మధ్యలో కాల్వలు, టైల్స్, విద్యుత్తు పనులు వదిలేశారు. పైగా ఆ పనులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. స్మార్ట్‌సిటీ కన్సల్టెన్సీ ఉన్నా పట్టించుకోవడం లేదు. నాణ్యత ప్రమాణాలు కూడా పరిశీలించే వారే లేకుండా పోయారు.

అధ్వానంగా...

టవర్‌సర్కిల్ చుట్టూ నిర్మించిన టైల్స్ అధ్వానంగా ఉన్నాయి. పనులు చేయాల్సి ఉండటంతో మొక్కుబడిగా వాటిని అతికించినట్లుగా ఉంది. టైల్స్ అన్నీ సమానంగా ఉండాల్సి ఉండగా ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా ఉండటం, ఫినిషింగ్ ఎక్కడా కనిపించడం లేదు. నడిచే ఫుట్‌పాత్ టైల్స్, విద్యుత్తు తీగలకు వేసిన పైపులైను నాసిరకంగా వేయడంతో అవి మూసుకుపోయాయి. అందుల్లోంచి విద్యుత్తు తీగలు రాకపోవడంతో పైనుంచి వేసినట్లుగా చెబుతున్నారు. ఈ పనులపై స్థానికులు కూడా విమర్శిస్తున్నారు. ఊహించిన విధంగా పనులు జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమైంది.

# ప్రాణదాతలు


ఖమ్మం : రోడ్డు ప్రమాదాలు, ఇతర రుగ్మతలతో ఉన్నవారికి రక్తం అత్యవసరమవుతోంది. డబ్బులు పెట్టినా కొన్ని గ్రూపుల రక్తం సకాలంలో లభించదు. కొందరు పేదరికంలో రక్తం కొనలేని దయనీయ పరిస్థితి. ఇలా ఆపదలో ఉన్న వారి చెంతకే వెళ్లి రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలవుతున్నారు. ఒకటీ రెండు కాదు ఏళ్లుగా ఎంతో మందికి పునర్జన్మ ఇస్తూ సామాజిక బాధ్యతను చాటుతున్నారు. సత్తుపల్లి మండలంలో ఇరవై పర్యాయాలకు పైగా రక్తదానం చేసినవారు పలువురి మన్ననలు అందుకుంటున్నారు. మరోవైపు ఇతరుల్లో అవగాహన కల్పిస్తూ అపోహలు తొలగిస్తూ వారిని సైతం ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా దాతల స్ఫూర్తిదాయక సేవలపై ప్రత్యేక కథనం.

జీవితకాలం కొనసాగిస్తా: కె.నాగేశ్వరరావు, రుద్రాక్షపల్లి

నాది 'ఓ' పాజిటివ్ రక్తం. ఇప్పటివరకు ఇరవై సార్లు రక్తదానం చేశాను. అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్న వారిని చూసి చలించిపోయి రక్తాన్ని దానం చేయడం ప్రారంభించాను. చాలా మందికి వారివారి బ్లడ్ గ్రూపు తెలియదు. ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపును తెలుసుకోవాలి. వేరే గ్రూపు రక్తం కావాలన్నా వెంటనే స్పందించి దాతలను చూపించి సహాయం చేస్తున్నా. నా జీవిత కాలం దీన్ని కొనసాగిస్తా.

ఒక్క ప్రాణం కాపాడినా జన్మధన్యమే: షేక్.రహీంపాషా, కాకర్లపల్లి

రక్తాన్ని దానం చేసి ఒక్క ప్రాణాన్ని కాపాడిన జన్మధన్యమే కదా అనే



ఉద్దేశంతో ఇప్పటి వరకు 31 సార్లు రక్తాన్ని దానం చేశా. నాది 'ఏ' పాజిటివ్. ఏ సమయంలోనైనా రక్తం కావాలని కోరితే ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నా. హైదరాబాద్, విజయవాడ, ఖమ్మంలాంటి ప్రాంతాలకు వెళ్లి రక్తాన్ని దానం చేశాను. దీనివల్ల వల్ల ఎంతో సంతృప్తి పొందుతున్నాను.

ఇతరుల ప్రాణాలను కాపాడాలనే..ఆర్.జనార్దన్ గుప్తా, ఖమ్మం

నాకు ఇప్పుడు 41 సంవత్సరాలు. 18 ఏళ్ల నుంచి రక్తదానం చేస్తున్నాను. ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున ఇప్పటి వరకు 54 సార్లు దానం చేశా. అత్యవసర సమయంలో 20 మందికి రక్తం ఇచ్చాను. రక్తదాతలను ప్రోత్సహించేందుకు రెడ్‌క్రాస్, వాసవీ, లయన్స్ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. గతంలో కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నాను. నేడు గవర్నర్ అవార్డుకు ఎంపికయ్యాను.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని..టి.సురేశ్, వైరా సీఐ

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఆలోచనతోనే రక్తదానం చేస్తున్నా. నిల్వ చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. శిబిరాలు ఎక్కడ ఏర్పాటు చేసినా తప్పకుండా హాజరవుతా. 16 ఏళ్ల నుంచి చేస్తున్నా. ఇప్పటి వరకు 35 సార్లు రక్తం ఇచ్చాను. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ప్రాణదాతలుగా నిలవాలి.

మూడు నెలల తర్వాత మళ్లీ ఇవ్వొచ్చు..కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్,సీహెచ్‌సీ, సత్తుపల్లి

సాధారణంగా 18 నుంచి 45 ఏళ్లలోపు వారితోపాటు పూర్తి ఆరోగ్యంగా ఉన్న 65 ఏళ్లలోపు వారు రక్తాన్ని ఇవ్వొచ్చు. రక్తం ఇచ్చిన మూడు నెలల తర్వాతే ఇవ్వాల్సి ఉంటుంది. అపోహలు మాని ప్రతి ఒక్కరూ రక్తాన్ని దానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలి.

# సీతమ్మసాగర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నేడు

ఖమ్మం : సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నారు. అశ్వాపురంలోని దోసపాటి రంగారావు, భారతి వర్తక సంఘం కల్యాణ మండపంలో జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సీతమ్మసాగర్ ప్రభావిత దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు మండలాల రైతులు, ప్రజలు హాజరుకానున్నారు. పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, పొదెం వీరయ్య, జలవనరులశాఖ సీఈ ఎ.శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం, భద్రాచలం ఎస్ఈలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రవీందర్ ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

వీడియో చిత్రీకరణ.. సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకత, దీనివల్ల కలిగే ప్రయోజనాల గురించి జలవనరులశాఖ అధికారులు వివరించనున్నారు. ఎమ్మెల్యేలు, రైతులు, ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేస్తారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు వీడియో తీయనున్నారు. పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్‌ను నిర్మిస్తున్నారంటూ దుమ్ముగూడెం మండలానికి చెందిన కొందరు ఈ ఏడాది మార్చిలో చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)ని ఆశ్రయించిన విషయం విదితమే. 'సీతమ్మసాగర్'ను నిలిపివేయాలని, అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మించాలని ఎన్‌జీటీ సూచించింది. సీతమ్మసాగర్ పనులను నిలిపేయటం లేదని ఫిర్యాదుదారులు మళ్లీ ఎన్‌జీటీని ఆశ్రయించారు. నిజానిజాలను నిర్ధారించేందుకు ఇటీవల ద్విసభ్య కమిటీని ఎన్‌జీటీ నియమించింది. వీటన్నింటి నేపథ్యంలో జలవనరులశాఖ అదికారులు సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు పొందేందుకు కసరత్తు మొదలుపెట్టారు. అందులో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకున్నారు.

# సర్దుబాటుతో సమస్యకు పరిష్కారం




ఖమ్మం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. కలెక్టర్ల సూచనల ప్రకారం పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్)కు సంబంధించిన ప్రతిపాదనలు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 20 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉభయ జిల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యా వాలంటీర్ల నియామక ప్రక్రియ నిలిచిపోయిన తర్వాత రెండేళ్లుగా 'సర్దుబాటు' పేరిట నెట్టుకొస్తున్నారు. ఖాళీలు భర్తీ కాకపోవటం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేయకపోవటంతో ఉన్నత పాఠశాలల్లో పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయి. గత ఏడాది విద్యా సంవత్సరం మధ్యలో ప్రారంభించిన ఈ ప్రక్రియ కొంత వరకు సత్ఫలితాలను ఇచ్చింది. అందుకే ఈసారి విద్యాసంవత్సరం ఆరంభంలోనే ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ముందుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా సర్దుబాటు చేయనుంది.

ఎంఈఓల నుంచి జిల్లాకు చేరిన ప్రతిపాదనలు...

ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేసే స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తారు. ఇప్పటికే ఎంఈఓలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందుకోసం తగిన మార్గదర్శకాలను రూపొందించారు. వీటి ప్రకారం తొలుత స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో, అక్కడ అవసరమైన ఉపాధ్యాయుడు లేకుంటే మండలంలో ఉన్న వారికి, అక్కడా లేకుంటే సమీప మండలం నుంచి సర్దుబాటు చేస్తారు. ఎంఈఓల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ అనుమతి తీసుకుని అమలు చేస్తారు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానంగా తెలుగు, వృక్షశాస్త్ర ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవటంతో దాని ప్రభావం పదో తరగతి ఫలితాలపై పడుతుందనే ఉద్దేశంతో ఈసారి విద్యాశాఖ ముందే మేల్కొనటం విశేషం.

317 జీఓతో తొలగిన ఇబ్బందులు...

గతంలో పాఠశాలలు పునః ప్రారంభమయ్యేనాటికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని మారుమూల మండలాల్లోని అనేక బడులను తెరిచేందుకు ఉపాధ్యాయులే ఉండేవారు కాదు. ఈసారి 317 జీఓ వల్ల ఏజెన్సీతో పాటు మారుమూల ప్రాంతాల్లో సైతం ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశారు. ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం, వేంసూరు, భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం పరిసర మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఉండేది.

సంఘాల నుంచి మిశ్రమ స్పందన...

కొద్ది రోజుల నుంచి 'పని సర్దుబాటు'కు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రాథమిక పాఠశాలలు దెబ్బతినకుండా చూడాలని కొందరు, దివ్యాంగ ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారిని దృష్టిలో ఉంచుకుని సర్దుబాటు చేయాలని మరికొందరు కోరుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు పక్కనున్న పాఠశాలలకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాం. కలెక్టర్ అనుమతి తీసుకున్న అనంతరం ఈనెల 20 నాటికి ఖాళీ పోస్టుల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమిస్తాం. సోమశేఖరశర్మ, డీఈవో ఖమ్మం,ఇన్‌ఛార్జి భద్రాద్రి కొత్తగూడెం

# ఆదిలోనే అడ్డంకులు!



వరంగల్ : పదేళ్లుగా అంతర్ వలయ రహదారికి అడ్డంకులు తప్పడం లేదు. పనులు ప్రారంభించే సమయానికి ఏదో ఒక సమస్య వెంటాడుతోంది. రెండు, మూడు రోజులుగా భూసేకరణపై ప్రైవేటు వ్యక్తులు నిరసన తెలుపుతున్నారు. క్షేత్రస్థాయిలో పనులు ఆపుతున్నారు. ఒక అడుగు ముందుకేసి ఈనెల 17న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపనను అడ్డుకుంటామని ప్రకటించారు. భూములిచ్చిన రైతులుకు నగదు ఇవ్వడం లేదని ప్రధానంగా ఆరోపిస్తున్నారు. ఇన్నర్ రింగురోడ్డు భూసేకరణపై కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, వరంగల్ జిల్లా రెవెన్యూ శాఖాధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే ఇబ్బందులొస్తున్నాయని తెలిసింది. 70 శాతం భూసేకరణ పూర్తయిందని, ఖిలావరంగల్ తూర్పు కోట శివారు భూములపై ప్రైవేటు వ్యక్తుల మధ్య పేచీ తలెత్తడం వల్ల మిగిలిన 30 శాతం ఆగిందని కుడా అధికారులంటున్నారు. భూసేకరణ సమస్యలు పరిష్కరించాల్సిన రెవెన్యూ శాఖాధికారులు మౌనంగా ఉండటంతో ఆందోళన చేపట్టారు.'

70-75 ఎకరాలు పూర్తి

అంతర్ వలయ రహదారి తొలి విడత రంగశాయిపేట నాయుడు పంపు నుంచి జానీపీరీలు, కీర్తినగర్, ఎనుమాముల వరకు సుమారు 8-9 కిలోమీటర్లు ప్రతిపాదించారు. మొత్తం 80-9 0 ఎకరాలు ప్రైవేటు భూములు సేకరించే లక్ష్యం ఉంది. వరంగల్ అర్బన్ జిల్లాగా ఉన్నప్పుడే భూసేకరణకు కుడా ఆర్డీవో వద్ద సుమారు రూ.75కోట్లు డిపాజిటు చేసింది. 70-75 ఎకరాల వరకు ప్రైవేటు భూముల సేకరణ పూర్తయింది. ఇంకా 10-15 ఎకరాలు పెండింగ్‌లో ఉంది. ఖిలావరంగల్ తూర్పు కోట శివారు భూముల దస్తావేజులు, యాజమాన్యపు హక్కులపై వివాదాలు తలెత్తాయి. దీంతో భూసేకరణ ఆగింది. ఖిలావరంగల్ తూర్పు కోట శివారు, ఇతర ప్రాంతాల్లో భూసేకరణ చేసేందుకు వరంగల్ ఆర్డీవో రీ నోటిఫికేషన్ ఇవ్వాలి. యజమాని పేరు, సర్వేనంబర్లు పొందుపరుస్తారు. సమస్యలుంటే బయటకొస్తాయి. రీ నోటిఫికేషన్ ఇచ్చే విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయ లోపం ఉందంటున్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కుడా ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. కలెక్టర్ దృష్టి సారిస్తే రైతుల సమస్యలు తీరుతాయంటున్నారు. ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాంఅంతర వలయ రహదారి ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని బాధిత భూ పోరాట సంఘ సభ్యులు హెచ్చరించారు. ఖిలావరంగల్‌లో పరిహారం అందని భూ బాధితులు నిరసనకు దిగారు. వెంటనే తమకు పరిహారం చెల్లించాలని ప్లకార్డులు చేత పట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని నినాదాలు చేశారు. నాయుడు పెట్రోల్ పంపు కూడలి నుంచి ఖిలావరంగల్, చింతల్ మీదుగా భూ సేకరణలో 300 మంది బాధితులు ఉన్నారని ఇందులో 150 మందికి పరిహారం చెల్లించగా మరో 150 మందికి చెల్లించకుండా పనులు మొదలు పెట్టడం శోచనీయమన్నారు. ఈనెల 17న మంత్రి కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపాదికన రింగ్‌రోడ్ శిలాఫలకానికి శంకుస్థాపన చేయించేందుకు తాత్కాలిక పనులు చేపట్టారు. అధికారు లు స్పందించకుంటే ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని భూ బాధితుల సమాఖ్య అధ్యక్షుడు గంగుల దయాకర్ హెచ్చరించారు. వెంకటరమణ, సారయ్య, ఉమాశంకర్‌గౌడ్, రియాజుద్దీన్, సత్యనారాయణ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

# తలాపునే వైద్యం.. కేటాయింపులో చోద్యం

కామారెడ్డి : వైద్యసేవలను పేదప్రజలకు అందించేందుకు పల్లెదవాఖానాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ప్రత్యేక సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చుతోంది. జిల్లాలో మాత్రం పీహెచ్‌సీల పరిధి మార్పు(గ్రామాల రేషనలైజేషన్)పై జిల్లా వైద్యశాఖ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాజంపేట మండలంలోని 12 గ్రామాల ప్రజలతో పాటు భిక్కనూరు మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరుపై ప్రత్యేక కథనం.

నివేదించినా ప్రయోజనం శూన్యం 2016లో తాడ్వాయి మండలంలోని 12 గ్రామాలు, భిక్కనూరు మండలంలోని 8 గ్రామాలతో రాజంపేట మండలంగా ఏర్పాటైంది. ఇంతకు పూర్వమే రాజంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల పరిధి మార్పుపై మండలాల ఏర్పాటుకు ముందే స్థానిక ప్రజాప్రతినిధులు, భిక్కనూరు, రాజంపేట మండల సభలు సైతం ప్రభుత్వానికి, వైద్యశాఖకు నివేదించాయి. పరిధి మార్పు మాత్రం జరగడం లేదు. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు పీహెచ్‌సీల పరిధి మార్పు జరగకుండా అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి.సుదూర ఆరోగ్య కేంద్రాల్లో సేవలురాజంపేట మండలంలోని కొండాపూర్, ఆర్గొండ, బస్వన్నపల్లి, అన్నారం తండా, గుడి తండా, శేర్‌శంకర్ తండా, ఎల్లారెడ్డిపల్లి తండా, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, నడిమితండా, ఎల్లాపూర్ తండా, సిద్దాపూర్ గ్రామాల ప్రజలకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలో ఉంటుంది. ప్రస్తుతం పీహెచ్‌సీల పరిధి మార్పిడి చేయకపోవడంతో వీరికి ఎర్రాపహాడ్‌లో మాత్రమే నిర్దేశిత వైద్యసేవలు అందిస్తున్నారు. భిక్కనూరు మండలంలోని అంతంపల్లి, జంగంపల్లి, లక్ష్మీనగర్ తండా, తిప్పాపూర్ గ్రామాల వైద్యసేవల పరిధిని రాజంపేట పీహెచ్‌సీగా నిర్ధరించారు. ఈ గ్రామాలకు సమీపంలోనే భిక్కనూరు పీహెచ్‌సీ ఉంటుంది. రాజంపేట మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన ప్రజలు ఎర్రాపహాడ్ పీహెచ్‌సీకి వెళ్లాలంటే సుమారు 45 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కొండాపూర్, ఆర్గొండ, బస్వన్నపల్లి వాసులు సైతం సదరు ఆరోగ్యకేంద్రానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేక సమస్యగా మారింది. రాజంపేట పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యసేవలతోనే సరిపెడుతున్నారు. గర్భిణులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు.

ఎర్రాపహాడ్‌కు వెళ్లాల్సి వస్తోంది- మనీష, ఆర్గొండ, రాజంపేటప్రాథమిక వైద్యసేవలు మినహా ఇతరత్రా వైద్యసేవల నిమిత్తం ఎర్రాపహాడ్ పీహెచ్‌సీకే వెళ్లాల్సి వస్తోంది. సుమారు 40 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. సమీపంలోని రాజంపేట పీహెచ్‌సీ పరిధిలో మా గ్రామం లేక సమస్యలు తలెత్తుతున్నాయి.

# పైపైన పూడికతీత!

వరంగల్ :వరంగల్ త్రినగరాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. వరద నీరు పారే నాలాలు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడికతీత పనుల పై పైన జరిగాయి. ఎక్కడ చూసినా అసంపూర్తి పనులే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోని నాలాలు శుభ్రం చేశారు. లోపలి వైపు ఉన్న వాటిని వదిలి పెట్టారు. చాలా ప్రాంతాల్లో నాలాలు, మురుగు కాల్వల నిండా వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇలాగైతే వరదనీరు ఎలా వెళ్తుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలానికి సర్వం సిద్ధమని బల్దియా పాలకులు, అధికారులు గొప్పలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పూడికతీత పనులు పైపైన జరిగినట్లు కనిపిస్తోంది. ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు పూడికతీత పనులు మమ అనిపించారు. బల్దియా సాధారణ నిధులు సుమారు రూ.1.78 కోట్లతో 33 నాలాల పూడికతీత పనులు ప్రతిపాదించారు. 15-18 నాలాల్లో పూడికతీత పనులు పూర్తిగా జరిగాయి. మిగిలినవి సగం సగం చేసి వదిలేశారనే విమర్శలున్నాయి.

ఇవిగో సాక్ష్యాలు

హంటర్ రోడ్ 12 మోరీల నాలా పనులు సగమే జరిగాయి. ప్రధాన రోడ్డు కల్వర్టు కింద వ్యర్థాలు, మట్టి పేరుకుపోయింది.

వరంగల్ పోతననగర్ నుంచి కాకతీయ మ్యూజికల్ గార్డెన్ వరకు భద్రకాళి నాలాలో పూడికతీత పనులే జరగలేదని స్థానికులంటున్నారు.

బల్దియా ఇండోర్ స్టేడియం వైపు వ్యర్థాలున్నాయి.

మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్ రామన్నపేట పెద్దమోరీ, రఘునాథ్ కాలనీ మురుగు కాల్వలో వ్యర్థాలు ఆగాయి. పూడికతీత పనులు చేపట్టలేదు.



వరంగల్ కాశీబుగ్గ నుంచి ఎల్బీనగర్ మీదుగా తిలక్ రోడ్‌కు వచ్చే ప్రధాన మురుగు కాల్వలో వ్యర్థాలున్నాయి. పూడికతీత పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తుమ్మలకుంట 80 అడుగుల రోడ్డు నుంచి ఆటోనగర్ మీదుగా కేఎల్‌మహేంద్రనగర్ వరకు ప్రధాన డ్రైనేజీలో వ్యర్థాలున్నాయి.

హనుమకొండ కాపువాడ నుంచి అలంకార్ కూడలికి వచ్చే పెద్ద మోరీలో వ్యర్థాలున్నాయి.

కాకతీయ కాలనీ, మచిలీబజారు, రాయపుర, రెడ్డి కాలనీ, ఈద్గా రోడ్ ప్రధాన కాల్వలో పూడికతీత పనులు చేపట్టలేదు.

హనుమకొండలో కీలకమైన నయీంనగర్ నాలాలో నాలుగు వెంట్లు ఉంటే, ఒకే ఒక వెంటు క్లియర్ చేశారు. మిగిలిన మూడు వదిలేశారు.

అన్నీ చేయాల్సిందే..

గుండు సుధారాణి, మేయర్ గ్రేటర్ వరంగల్

నాలాలు, ప్రధాన మురుగు కాల్వల్లో వ్యర్థాలు క్లియర్ చేయాల్సిందే. వంద శాతం పనులు చేస్తేనే బిల్లు చెల్లిస్తాం. సగం చేస్తే బిల్లు ఇచ్చేది లేదు. క్షేత్రస్థాయిలో నాలాలు పరిశీలిస్తాం. అన్ని చూశాకే ఎంబీ రికార్డు చేయాలని ఇంజినీర్లను కోరాను.

# హరితోత్సవానికి వేళాయే..

పెద్దపల్లి : జిల్లాలో తొమ్మిదో విడత హరితహారం మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏటా వర్షాలు కురిసిన తర్వాత మొక్కలు నాటేవారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న 'హరితోత్సవం' పేరిట మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 31.64 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. కాగా గ్రామాల్లో గుంతల తవ్వకాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో 31 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యం విధించారు. గ్రామీణాభివృద్ధిశాఖ 16.50 లక్షలు నాటనున్నారు. అటవీ 1.40 లక్షలు, రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు 5.02 లక్షలు, మిగిలిన 8.08 లక్షలు ఇతర శాఖలు నాటనున్నాయి. ఈ ఏడాది టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటనున్నారు.

సర్కారు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా..



జిల్లాలో నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణానికి సేకరించిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ముఖ్యంగా ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ స్థలాలనూ అక్రమార్కులు వదలడం లేదు. ఈ సారి ప్రభుత్వ స్థలాలను రక్షించేందుకు అవసరాల నిమిత్తం సేకరించిన భూముల్లో మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు దస్త్రాల ఆధారంగా క్షేత్ర స్థాయిలో హద్దులు నిర్ణయించి మొక్కలు నాటేందుకు జాబితా సిద్ధం చేశారు.

శరవేగంగా గుంతల తవ్వకాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ కూలీలు మొక్కలు నాటేందుకు శరవేగంగా గుంతల తవ్వకాల పనులు చేపడుతున్నారు. ఈ నెల 19న మొక్కల నాటే కార్యక్రమం ప్రారంభంకానుండటతో రోజువారీగా గుంతల తవ్వకాల లక్ష్యాలు విధించారు. అయితే నర్సరీల్లో మొక్కల ఎదుగుదల ఆందోళన కలిగిస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడమే దీనికి కారణం.

మొక్కల కొరత లేదు

దశాబ్ది ఉత్సవాల్లో హరితోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటనున్నాం. నర్సరీల్లో పెద్ద సైజ్‌లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి కొరత లేదు. వేసవిలో నర్సరీల్లో మొక్కల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. శ్రీధర్, గ్రామీణాభివృద్ధి అధికారి

# బొగ్గు ఉత్పత్తితో గనికీర్తి

ఖమ్మం : వార్షిక సంవత్సరంలో నిర్దేశించిన 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి సత్తుపల్లి జేవీఆర్ ఓసీ-2 చరిత్ర సృష్టించింది. 130 ఏళ్ల సింగరేణి ప్రస్థానంలోనే ఇది రికార్డు అని అధికారులు చెపుతున్నారు. భారతదేశంలోనే ఉత్పత్తి సాధనలో జేవీఆర్ ఓసీ నాలుగో స్థానంలో నిలవడం విశేషం. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయడంతో సింగరేణి ఉన్నతాధికారులు, జేవీఆర్ ఓసీ అధికారులు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది యావత్ సింగరేణికే మణిహారంగా నిలిచింది. మార్చి 30 నాటికి 99.66లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగా 31న ఒక్క రోజే మిగిలిన మొత్తం ఉత్పత్తి సాధించింది.

ఫలించిన యంత్రాంగం కృషి



2022-23 వార్షిక సంవత్సరంలో సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం కోసం అధికార యంత్రాంగం చేసిన కృషి ఫలించింది. సీఎండీ ఆదేశాల మేరకు డైరెక్టర్లు, జీఎం జక్కం రమేశ్ సలహాలు, సూచనలు, పీవో వెంకటాచారి నిరంతర పర్యవేక్షణ, అధికారులు, కార్మికులతో సమీక్షా సమావేశాలు నిర్వహణ, యంత్రాల సమగ్ర వినియోగంతో లక్ష్యం ఛేదన సాధ్యమైంది. కొత్తగూడెం ఏరియాలో 2022-23 ఏడాదికి గాను 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టగా 128 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఇందులో ప్రథమంగా జేవీఆర్ ఓసీ-2 గనికి 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని కేటాయించగా అధిగమించి రికార్డును నెలకొల్పింది.గనిలోని ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితోనే ఉత్పత్తి సాధ్యమైంది. సింగరేణి డైరెక్టర్లు, జీఎం ప్రశంసలు మరింత ప్రోత్సాహానిచ్చాయి. వెంకటాచారి, జేవీఆర్ ఓసీ, పీవో, సత్తుపల్లి

# పాఠశాలల సమస్త సమాచారం.. ట్యాబ్‌లో నిక్షిప్తం

భూపాలపల్లి: రోజురోజుకు సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రభుత్వం 'ట్యాబ్'లను పంపిణీ చేస్తూ, అందులోనే పూర్తి వివరాలను నమోదు చేసేలా చర్యలు చేపడుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ మేరకు పాఠశాలల ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులు పంపిణీ చేయనుంది. ఇప్పటికే వస్త్రం పంపిణీ చేయడంతో జిల్లా విద్యా శాఖ అధికారులు స్కూల్ డ్రెస్‌లు కుట్టడానికి మహిళా సంఘాలకు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సమగ్ర స్వరూపాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు గతంలోనే 'యూ డైస్ ప్లస్' వంటి కార్యక్రమా లను చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు తమ చరవాణుల్లో సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేవారు. ఈ విధానంతో కొంతమేరకు ఇబ్బందులు ఎదురయ్యేవని, ప్రత్యేకంగా ట్యాబ్‌లు పంపిణీ చేయాలని గతంలో పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాయి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ట్యాబ్‌లు సరఫరా చేసింది.

జిల్లాకు 294 ట్యాబ్‌లు..భూపాలపల్లి జిల్లాలోని 11 మండలాల్లో మొత్తం 319 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 44 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. రెండు రోజుల క్రితం జిల్లాలోని 44 యూపీఎస్‌లకు ట్యాబ్‌లు 44 మంజూరు కాగా 319 పీఎస్‌లకు మొత్తం 250 వరకు ట్యాబ్‌లు వచ్చాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం జిల్లాకు 294 ట్యాబ్‌లు కేటాయించారు. వీటిని డీఈవో కార్యాలయంలోనే నిల్వ చేశారు. వీటి పంపిణీ కోసం ఇంకా స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. 150 కంటే ఎక్కువ విద్యార్థులున్న




పాఠశాలలకు రెండేసి ట్యాబ్‌లు ఇస్తారు. ట్యాబ్‌ల వినియోగంపై మొదట జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్షణ అధికారులు శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు తర్ఫీదునిచ్చి ట్యాబ్‌లు అందజేయనున్నారు. 'తొలిమెట్టు'లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం, బాలబాలికల వివరాలు, మన ఊరు-మన బడి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐఎస్ఎంఎస్ పోర్టల్, చైల్డ్ఇన్ఫో తదితర పూర్తి సమాచారాన్ని ట్యాబ్‌లలో పొందుపర్చనున్నారు.

తగ్గనున్న ఇబ్బందులు..

ఇంత వరకు పాఠశాలల్లో సమాచారాన్ని ఉపాధ్యాయులు వారి చరవాణుల్లో ఆన్‌లైన్ చేసేటప్పుడు చాలా వరకు ఇబ్బందులు ఎదురయ్యేవి.. నేడు ఈ ట్యాబ్‌ల పంపిణీతో ఇబ్బందులు తొలగిపోనున్నాయని పలువురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌ల కారణంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలు, సంక్షేమం గురించి వెంటనే తెలియపర్చడానికి అనుకూలంగా ఉంటుంది. యూ డైస్ ప్లస్‌లో ఎన్ని రకాల సమాచారం ఉంటుందో ట్యాబ్‌ల్లోనూ అంత సమాచారం నమోదుకు చేసుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# రెండుచోట్లా.. రిక్తహస్తమే..!



ఖమ్మం : రాష్ట్రంలో కొత్తగా రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం మార్చి 25న ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు, పెద్దపల్లి జిల్లా రామగుండంలో నూతనంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఈ రెండూ ఏప్రిల్ 1నుంచి మనుగడలోకి రానున్నాయి. పూర్వ ఖమ్మం జిల్లాలో దీర్ఘకాలిక డిమాండ్ ఉన్న రెండు ప్రాంతాల్లో కూడా సబ్ రిజిస్ట్రార్ ఏర్పాటు విషయంలో మొండిచెయ్యే ఎదురైంది. ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వానికి గతంలో ప్రతిపాదనలు పంపారు. కానీ మంజూరుకు నోచుకోలేదు.

జిల్లాకేంద్రాన్ని దాటి..ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ భూములకు ధరలు కూడా ఎక్కువ. రఘునాథపాలెంలో భూముల క్రయవిక్రయ లావాదేవీల రిజిస్ట్రేషన్ల కోసం కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్ఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. పక్కనే ఉన్న కామేపల్లి, సింగరేణి మండలాలను కలిపి రఘునాథపాలెంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా కోరుతున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు పలుమార్లు సమస్యను విన్నవించారు. కార్యరూపం దాల్చలేదు.

80-90 కిలోమీటర్ల దూరంలో..

భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేదు. ఉద్యాన కూడలిగా పేరుగాంచిన అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నాన్ ఏజెన్సీ ప్రాంతాలూ ఉన్నాయి. అశ్వారావుపేట పట్టణం, మందలపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భూములు, ఇళ్ల స్థలాల క్రయవిక్రయ లావాదేవీలు సాగుతుంటాయి. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల ప్రజలకు భూముల రిజిస్ట్రేషన్ల కోసం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం వెళ్లాల్సి ఉంటుంది. అశ్వారావుపేట మండల వాసులు కొత్తగూడెం వెళ్లాలంటే దాదాపు 100 కి.మీ. దూరం ప్రయాణించక తప్పదు.

ఆదాయ నగరం..

ఉభయ జిల్లాల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం రూ.224.03 కోట్లు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి రూ.224.03 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి లభించింది. రెండు జిల్లాల పరిధిలో గతేడాది కంటే ఈ ఏడాది శాఖకు ఆదాయం స్వల్పంగా తగ్గింది. ఖమ్మం ఎస్ఆర్వో కార్యాలయంలో మాత్రం గతేడాది కంటే అధికంగా ఆదాయం లభించింది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య మాత్రం తగ్గింది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి.

# పాడి రైతులకు భరోసా



ఖమ్మం : పాడి రైతులకు భరోసా ఇచ్చేందుకు పశుగణాభివృద్ధి సంస్థ ప్రయత్నిస్తోంది. పాడిసంపద వృద్ధి కోసం ప్రతి రైతు ఆడ దూడ పుట్టాలని కోరుకోవడం, ఒకవేళ మగదూడ పుడితే పోషణ భారంతో విక్రయిస్తున్న సందర్భాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టేలా చేసిన ప్రయోగాలు సఫలం కావడంతో దీన్ని ఉమ్మడి జిల్లాలో మరో వారంలో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గతంలో వ్యవసాయ సాగుకు పశుపోషణ ఊతంలా ఉండేది. నేడు పరిస్థితి మారిపోయింది. కేవలం పాడిసంపద కోసమే పశుపోషణ అన్నట్లు మారిపోయింది. కృత్రిమ గర్భధారణ సమయంలో ఆడదూడలు పుడితే పాడిపరమైన లాభదాయకం ఉంటుందని రైతులు యోచిస్తున్నారు. కానీ ఇప్పటివరకు జరిగిన కృత్రిమ గర్భధారణలో వంద దూడలు పుడితే సగం ఆడ, సగం మగ పుట్టేవి. కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టేలా ప్రత్యేక వీర్యకణాలు తయారు కావడంతో పాటు తెలంగాణ పీవీ నర్సింహారావు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆమోదం పొందటంతో మరో వారంలో ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వైరాలోని పశుగణాభివృద్ధి సంస్థ నుంచి ఈ కార్యక్రమం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్వహణ ఇలా..

వారం పది రోజుల్లో పట్టాలెక్కనున్న నూతన ప్రక్రియలో రైతులు కోరితే ఆడదూడ పుట్టేలా కృత్రిమ గర్భధారణ చేయనున్నారు. తెల్ల పశువుల్లో జెర్సీ, హెచ్‌ఎఫ్ (నల్లమచ్చలతో ఉండే తెల్లఆవు), మహారాష్ట్రకు చెందిన సాహివేల్ జాతికి చెందిన వీర్యకణాలు అందుబాటులో ఉన్నాయి. నల్ల జాతి నుంచి ముర్రా మాత్రమే ఉంది. పుణేలోని బేఫు, కశ్మీర్‌లోని రుషికేశ్ నుంచి ఆయా వీర్యకణాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 30చోట్ల వీటిని ప్రయోగించారు. ప్రయోగాత్మక దశలో బోనకల్లులోని రావినూతల, రూరల్‌లోని కామంచికల్లులో రెండు ఆడదూడలు పుట్టగా ఇతర చోట్ల చూడి దశలో ఉన్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు జరిగే సాధారణ కృత్రిమ గర్భధారణకు ఒక్కోటి రైతు నుంచి నామమాత్రంగా రూ.100 వసూలు చేస్తుండగా ఆడదూడ పుట్టేందుకు చేసే గర్భధారణ ధర రూ.300 వరకు ఉండే అవకాశాలున్నాయి.

రైతులకు ఊరట: కె.కిశోర్, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి

కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టించేలా కొత్త వీర్యకణాలు వచ్చాయి. వీటికి ఆమోదం వచ్చింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రయోగించాం. మరో మగదూడలను పోషణ చూడకుండా వదిలేస్తుండటంతో చనిపోతున్నాయి. దీనివల్ల మార్పునకు శ్రీకారం చుడుతున్నాం.

# ఉపాధి పనుల్లో మగువలదే హవా!

జనగామ : నిరుపేదలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఓ వరం. గ్రామీణ ప్రజలు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. పురుషుల కంటే మహిళలే అధికంగా ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్నారు. మగవారికి దీటుగా పని చేస్తూ సంపాదనలోనూ పైచేయి సాధిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో చేపట్టిన ఇంకుడుగుంతలు, భూ అభివృద్ధి పనులు, హరితహారం, మట్టి రహదారుల నిర్మాణం, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, కంపోస్టు షెడ్ల నిర్మాణం.. తదితర పనుల్లో భాగస్వాములవుతున్నారు.

రూ.20 కోట్లకు పైగా కూలీ ఆర్జన ఉపాధి హామీ పనులకు మహిళలే అధికంగా హాజరవుతున్నారు. జిల్లాలో 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో మహిళా కూలీలు రూ.20 కోట్లకు పైగా ఆర్జించారు. మొత్తం 95,801 మంది కూలీలు పని చేయగా వారిలో మహిళలు 54,418 మంది, పురుషులు 41,383 మంది ఉన్నారు. పురుషులు రూ.1,297 లక్షల వేతనం ఆర్జించగా, మహిళలు రూ.2,077 లక్షల వేతనం సంపాదించారు. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండటం, స్థానికంగానే పనులు కల్పిస్తుండటం, పనులు సులభంగా ఉండడంతో ఉపాధి పనులు చేసేందుకు అతివలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు చెబుతున్నారు.

వసతులు కల్పిస్తే ఇంకా పెరిగే అవకాశం

ఉపాధిహామీ పథకం ప్రారంభమైన మొదట్లో కూలీలకు అన్ని వసతులు కల్పించేవారు. క్రమ క్రమంగా వసతుల లేమితో కొంత మేర కూలీలు తగ్గారు. రోజుకు రెండు లేదా మూడు గంటల వ్యవధిలో రూ.150 నుంచి రూ.300 వరకు సంపాదించుకునే ఆస్కారం ఉండడంతో వ్యవసాయ ఆధారిత కూలీలు సైతం ఉపాధిపనుల వైపే మొగ్గు



చూపుతున్నారు. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల సంఖ్య తగ్గడం తో.. రైతులు గుత్తా లెక్కన కూలీలను మాట్లాడుకొని పనులు చేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో మందికి జీవనాధారమైంది. ప్రైవేటు కంపెనీల్లో సాధారణ జీతంతో పనిచేసిన మహిళలు, నిరుద్యోగులు సైతం కొవిడ్ దెబ్బతో ఉద్యోగాలు పోవడంతో ఉపాధి పనులకు వెళ్తున్నారు.

కోరిన వారికి జాబ్‌కార్డులు ఇస్తున్నాం..

ఉపాధి పనులు చేసేందుకు ముందుకొచ్చే వారికి జాబ్‌కార్డులు ఇస్తున్నాం. పురుషులతో కంటే మహిళలే ఎక్కువగా ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఇంకా ఎవరైనా ఉపాధి పని చేయాలనుకుంటే సంబంధిత క్షేత్ర సహాయకులను సంప్రదించి జాబ్‌కార్డును పొందవచ్చు. డీఆర్డీవో రాంరెడ్డి

# చేతులే యంత్రమా.. వ్యాపారి చెప్పిందే నాణ్యతా?

భూపాలపల్లి : అకాల వర్షాలు చీడపీడల నుంచి మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొద్దోగొప్పో చేతికొచ్చిన పంటను మార్కెట్‌కి తీసుకువెళ్తే గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. యార్డులో రెండు లాట్లకు గరిష్ఠ ధరలు ఇస్తూ.. మిగిలిన లాట్లకు కనిష్ఠ ధరలు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మిర్చి నాణ్యతను ఐదు నిమిషాల్లో తెలిపే మిషన్లను జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో మార్కెట్‌కు రూ.13లక్షలు వెచ్చించి సెంటర్



ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ సంస్థ రూపొందించిన మిర్చి నాణ్యత యంత్రాన్ని 2022 మార్చిలో ఏర్పాటు చేశారు. ఏడాది పూర్తవుతున్నా ఆ యంత్రాన్ని ఇప్పటి వరకు వినియోగించింది లేదు. నాణ్యత తెలిస్తే తగిన ధరను డిమాండ్ చేసే అవకాశం ఉంటుందని అన్నదాతలు చెబుతున్నారు.

తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నారు

ధరంసోతు నరేశ్, క్యాంపుతండా, కేసముద్రం : నాణ్యత పేరుతో మార్కెట్‌లో తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నారు. వ్యాపారి చేతితో పట్టుకొని తేమ ఉందని చెబుతున్నారు. అత్యవసరంతో ఒకటి రెండు బస్తాలు మార్కెట్ బయట విక్రయిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మార్కెట్‌లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మిర్చి నాణ్యత యంత్రం నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

సాంకేతిక లోపం ఉంది

రాజా, మార్కెట్ కార్యదర్శి, కేసముద్రం : జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్ యార్డుల్లో గతేడాది మార్చిలో మిర్చి నాణ్యత యంత్రాలు ఏర్పాటు చేశాం. సాంకేతిక లోపం కారణంగా వినియోగించటం లేదు. ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం..

# వడివడిగా.. ఆయుష్మాన్ భారత్!

భూపాలపల్లి : పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం అందని ద్రాక్షలానే మిగిలిపోతోంది.. ఏదైనా అనారోగ్య సమస్య ఎదురైతే చికిత్స చేయించుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే లక్షల్లో బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం దేశ జనాభాలో 40 శాతం మంది అత్యంత పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. అలాంటి వారంతా అనారోగ్యం పాలైతే ప్రభుత్వ ఆసుపత్రులే దిక్కు.. ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని పేదలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం ద్వారా రూ.2 లక్షల వరకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంటుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం తరహాలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో నమోదు చేసుకున్న ప్రతి వ్యక్తికి దేశ వ్యాప్తంగా ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఈకేవైసీ ద్వారా నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

చాలా మందికి అవగాహన లేక..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ఈకేవైసీ నమోదు కేవలం 36 శాతమే నమోదు కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 76 మండలాలు ఉండగా దారిద్ర్య రేఖకు దిగువన 4.92 లక్షల కుటుంబాలు ఉన్నాయి. అందులో 15.29 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరందరి వివరాలను ఈకేవైసీ ద్వారా నమోదు చేస్తేనే వారికి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు.




కార్యక్రమ అమలుకు సంబంధించి సరైన ప్రచారం కల్పించకపోవడంతో చాలా మందికి అవగాహన లేక ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు కావడంలో వెనకడుగు పడుతోంది.

దేశంలో ఎక్కడైనా..

రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి లభించడంతో అర్హులైన లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించే అవకాశం ఉంటుంది. తాజాగా కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు అవకాశం కల్పించారు. అలాగే దేశ వ్యాప్తంగా ఎక్కడైనా రూ.5 లక్షలలోపు ఉచితంగా వైద్య చికిత్సలు పొందే అవకాశం ఉంది. ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు పూర్తయితే సంబంధిత కార్డు పోస్టు ద్వారా ఇంటికి పంపించనున్నారు. ఈ కార్డు ఏ రాష్ట్రంలోనైనా అమలులో ఉండటంతో ఎక్కడైనా వైద్యం పొందే అవకాశం ఉంటుంది.

నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం..

ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈకేవైసీ నమోదుకు సంబంధించి గతంలో ఏఎన్ఎం, ఆరోగ్య మిత్రలతో నమోదు చేయించాం. కంటి వెలుగు కార్యక్రమం అమలులో ఉండటంతో నమోదులో కాస్త వెనకబడింది. తాజాగా కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా ఈకేవైసీ నమోదు చేస్తున్నాం. డాక్టర్ కమల్‌చంద్‌నాయక్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ఉమ్మడి వరంగల్ జిల్లా



## ఐరాసలో యోగా.. వైట్‌హౌస్‌లో ఆతిథ్యం

# ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా షెడ్యూల్ ఖరారు

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 20 నుంచి 25 వరకు ఆయన అమెరికా, ఈజిప్టు దేశాల్లో పర్యటించనున్నట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. జూన్ 21న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలకు ప్రధాని నేతృత్వం వహించనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏటా నిర్వహించుకోవాలని 9 ఏళ్ల క్రితం ఇదే ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రధాని మోదీ తొలిసారి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఐరాస ప్రధాన కార్యాలయంలో యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొనడం ఇదే తొలిసారి. జూన్ 21న ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఈ యోగా సెషన్ జరగనుంది. ఇందులో ఐరాస ఉన్నతాధికారులు, పలు దేశాల రాయబారులు, దౌత్యవేత్తలు పాల్గొననున్నారు.

**మోదీకి బైడెన్ ఆతిథ్యం..** ఇక, అమెరికా పర్యటనలో భాగంగా జూన్ 22న ప్రధాని మోదీ వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో సమావేశం కానున్నారు. అదే రోజు సాయంత్రం అధ్యక్షుడు బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్.. మోదీకి అధికారిక విందు ఇవ్వనున్నారు. దీనికంటే ముందు అమెరికా కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నట్లు విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. జూన్ 23న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కలిసి ప్రధానికి ఆతిథ్యమివ్వనున్నారు. వాషింగ్టన్‌లో ప్రధాని పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కంపెనీల సీఈవోలు, పలు రంగాల నిపుణులతో ఆయన చర్చలు జరపనున్నారు. ప్రవాస భారతీయులతో ముచ్చటించనున్నారు. అమెరికా పర్యటన నుంచి ప్రధాని నేరుగా ఈజిప్టు వెళ్లనున్నారు. జూన్ 24, 25 తేదీల్లో ఆయన ఆ దేశంలో పర్యటించనున్నారు. ప్రధాని హోదాలో మోదీ ఆ దేశానికి వెళ్లనుండటం ఇదే తొలిసారి.

# పర్యాటకులను ఆకర్షించేలా జూ పార్క్‌ల అభివృద్ధి

## అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



అమరావతి: పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలోని జూ పార్క్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన జూ అథారిటీ ఆఫ్ ఏపీ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించేలా విశాఖ, తిరుపతి జూ పార్క్‌లను తీర్చిదిద్దేందుకు.. దేశంలోని పలు జూ పార్క్‌ల అథారిటీలతో జంతువుల మార్పిడి కోసం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. జంతువులను సంరక్షించే సిబ్బంది నియామకాలు, రెగ్యులరైజేషన్‌పై హేతుబద్ధత కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విశాఖ జూ పార్క్‌కు సంబంధించిన కొత్త లోగోను, జంతువులను పోలిన పలు వస్తువులను మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. జంతువుల చిత్రాలతో రూపొందించిన టీషర్ట్‌లు, టోపీలు, గృహాలంకరణ వస్తువులను పరిశీలించారు. అటవీదళాల అధిపతి మధుసూదన్‌రెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియపాండే, అటవీ శాఖ స్పెషల్ సెక్రటరీ చలపతిరావు, విశాఖ క్యూరేటర్ నందినీ సలారియా, తిరుపతి క్యూరేటర్ సెల్వం, విశాఖ సర్కిల్ హెడ్ శ్రీకంఠనాథరెడ్డి, తిరుపతి సర్కిల్ హెడ్ ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, పవన్‌పై మరోసారి నోరు పారేసుకున్న కొడాలి నాని



కృష్ణా జిల్లా: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని మరోసారి నోరుపారేసుకున్నారు. "నేను లెగిస్తే ఎవరూ పడుకోరని చంద్రబాబు సొల్లు కబుర్లు చెబుతున్నారు. చంద్రబాబు మగాడైతే గుడివాడ నుంచి పోటీ చేయాలి" అని నాని సవాల్ విసిరారు. గురువారం గుడివాడలోని మల్లాయపాలెం టిడ్కో లే అవుట్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కొడాలి నాని మాట్లాడుతూ... గుడివాడ నియోజకవర్గంలో ఇళ్ళ పట్టాల కోసం చంద్రబాబు ఒక ఎకరం ఇచ్చినట్లు నిరూపించినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. ఈ రాష్ట్రానికి జగనే శాశ్వత ముఖ్యమంత్రి అని కొడాలి నాని స్పష్టం చేశారు.

**పవన్ కళ్యాణ్‌పై కొడాలి సెటైర్స్ :** నాని ఇంకా మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సెటైర్లు విసిరారు. అసెంబ్లీలో అడుగు పెట్టడానికి పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టారన్నారు. నవనీత్ కౌర్, సుమలత ఇద్దరూ సినీ హీరోయిన్లని.. ఈ ఇద్దరూ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎంపీలు అయ్యారని తెలిపారు. అయితే 16 పార్టీలతో పొత్తులు పెట్టుకుని పవన్ కళ్యాణ్ ఏం సాధించారని ప్రశ్నించారు. చంద్రబాబు కోరిక ప్రతిపక్ష నేతగా ఉండటమని.. పవన్ కళ్యాణ్ కోరిక ఎమ్మెల్యే కావటమని.. దీని కోసం ఈ ఇద్దరూ పొత్తు పెట్టుకుంటున్నారని వ్యాఖ్యలు చేశారు. జగన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించేగలిగే ధైర్యం ఈ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఎవరికీ లేదని కొడాలి నాని పేర్కొన్నారు.

# మరోసారి నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి కంటతడి



ఎన్టీఆర్ జిల్లా: నందిగామ పురపాలక సంఘంలో అంతర్గత కుమ్ములాటలు మరోసారి బయటపడ్డాయి. మున్సిపల్ చట్టంలోని రిక్విజేషన్ పేరుతో సమావేశం ఏర్పాటు వివాదానికి కారణంగా నిలిచింది. నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మహిళనని చూడకుండా మున్సిపల్ కమిషనర్ ప్రతిసారీ అవమాన పరుస్తున్నారన్నారంటూ కంటతడిపెట్టారు. మున్సిపల్ కమిషనర్ లాగా కాకుండా, ఒక రాజకీయ నాయకుల్లాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నెలాఖరులో సమావేశం ఏర్పాటు చేసి ఈ ఐదు అంశాలను చర్చిద్దామని అనుకుంటే ముందుగానే ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చెప్తున్నారని.. ఈ విధంగా తనను అవమానించడం ఏ రకంగా సమంజసమని మండవ వరలక్ష్మి ప్రశ్నించారు. కాగా ఈ సమావేశానికి ముందు కౌన్సిల్ సభ్యులు... చైర్మన్‌ను కలిసి సమావేశానికి రావాల్సిందిగా కోరారు. అందుకు అంగీకరించని వరలక్ష్మి చైర్మన్ రూమ్‌లోనే ఉండిపోయారు. దీంతో చేసేదేమీ లేక కౌన్సిల్ సభ్యులు కాసేపటికే సమావేశ మందిరానికి వెళ్లిపోయారు. కాగా.. కొద్ది రోజుల క్రితం కూడా మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నీటి పర్యంతమయ్యారు. నగర పంచాయతీ అధికారులు తనకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదంటూ ఏకంగా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు ముందు ఆవేదన చెందారు. నగర పంచాయతీ బడ్జెట్ సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తనకు ఎజెండా కాపీని కూడా ఇవ్వలేదని.. కార్యాలయం నుంచి ఏ సమాచారం తనకు ఇవ్వకుండా అవమానిస్తున్నారని అన్నారు. దీనిపై కమిషనర్, సిబ్బంది నుంచి ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బడ్జెట్ సమావేశం వాయిదా పడింది. అయితే ఇప్పుడు తాజాగా మున్సిపల్ చట్టంలోని రిక్విజేషన్ పేరుతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తీవ్రంగా ఖండించారు.

# వైఎస్ వివేకా హత్య కేసు విచారణ జూన్ 30కి వాయిదా




హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ హత్య కేసుకు సంబంధించి శుక్రవారం ఉదయం సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఆరుగురు నిందితులను కోర్టులో సీబీఐ హాజరుపర్చింది. గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, దేవిరెడ్డి శివ శంకర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలను సీబీఐ అధికారులు కోర్టులో హాజరుపర్చారు. తదుపరి విచారణను సీబీఐ కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. దీంతో నిందితులను అధికారులు తిరిగి చంచల్ గూడ జైలుకు తరలించారు. కాగా.. జూన్ 30న వివేకా హత్య కేసు దర్యాప్తును ముగించాలని సీబీఐను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. మరోవైపు సీబీఐ కోర్టు కూడా ఈ కేసు విచారణను ఈనెల 30కి వాయిదా వేసిన నేపథ్యంలో ఏం జరుగుతుందా అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఇదిలా ఉంటే.. వివేకా హత్య కేసులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని సీబీఐ ఏ8గా పేర్కొంది. అవినాశ్‌కు తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు అవినాశ్ ప్రతీ శనివారం సీబీఐ ముందు విచారణకు హాజరవుతున్నారు. ప్రతీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవినాశ్‌ను సీబీఐ అధికారులు విచారించారు. వివేకా హత్యకు సంబంధించి అనేక విషయాలను ఎంపీని సీబీఐ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ముందస్తు బెయిల్ తర్వాత రెండు శనివారాలు అవినాశ్ సీబీఐ విచారణను ఎదుర్కున్నారు.



## బాపట్ల జిల్లాలో దారుణం..

# టెన్త్ విద్యార్థిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు!

చెరుకుపల్లి : బాపట్ల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. పదో తరగతి విద్యార్థి అమర్నాథ్‌పై స్నేహితుడే పెట్రోల్ పోసి నిప్పంటించారు. చెరుకుపల్లి మండలం రాజోలులో ఈ ఘటన జరిగింది. ఉదయం ట్యూషన్‌కు వెళ్లొస్తుండగా బాలుడి స్నేహితుడు వెంకటేశ్వరరెడ్డి మరికొందరితో కలిసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన అమర్నాథ్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.

వివరాల్లోకి వెళితే.. చెరుకుపల్లి మండలం రాజోలు పంచాయతీ పరిధి ఉప్పలవారిపాలెంకి చెందిన ఉప్పల అమర్నాథ్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రోజూ ఉదయం రాజోలులో ట్యూషన్‌కి వెళుతున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం వెళుతుండగా మార్గంమధ్యలో రెడ్లపాలెం వద్ద అమర్నాథ్ స్నేహితుడు వెంకటేశ్వరరెడ్డి మరి కొందరితో కలిసి అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటల అంటుకొని బాలుడు హాహాకారాలు చేస్తుండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే మంటలు ఆర్పి అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. తనపై వెంకటేశ్వర్‌రెడ్డి, మరికొందరు పెట్రోల్ పోసి నిప్పంటించారని మృతికి ముందు పోలీసులకు అమర్నాథ్ వాంగ్మూలం ఇచ్చాడు. ఈ ఘటనపై చెరుకుపల్లి ఎస్సై కొండారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం

తిరుపతి : తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గోవిందరాజస్వామి ఆలయం సమీపంలోని లావణ్య ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదం జరగడం.. మంటలు ఇళ్ల వైపు వ్యాపిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

గోవిందరాజస్వామి ఆలయ రథం వైపు మంటలు వస్తుండటంతో అగ్నిమాపక సిబ్బంది ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఐదంతస్తుల భవనంలోని ఓ ఫ్లోర్‌లో ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. అందులో విద్యుదాఘాతంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో రూ.కోట్ల విలువైన ఫొటోలు దగ్ధమయ్యాయి. మూడు అగ్నిమాపక వాహనాల్లో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

మరోవైపు భవనం ముందు ఉన్న ఐదు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. మంటలు చెలరేగడంతో ఫొటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీశారు. భవనంలో ముగ్గురు వ్యక్తులు చిక్కుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

# వివేకా హత్య కేసు.. ఆరుగురి నిందితుల రిమాండ్ పొడిగింపు



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుల రిమాండ్‌ను సీబీఐ కోర్టు పొడిగించింది.

నిందితులు ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిల రిమాండ్‌ను ఈనెల 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అనంతరం విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఆరుగురు నిందితులను పోలీసులు ఇవాళ సీబీఐ కోర్టులో హాజరుపరిచారు. విచారణ సందర్భంగా కోర్టు ఆరుగురి నిందితులకు రిమాండ్ పొడిగించింది.

# ఆర్థిక పరిస్థితిపై వారిద్దరితో చర్చకు సిద్ధం.... బుగ్గన సవాల్



విజయవాడ: సెంట్రల్ జీఎస్టీతో పోలిస్తే ఏపీలో 4 శాతం మేర అదనంగా పన్ను వసూళ్లు అయ్యాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... పాలన రాదు, ఆదాయం లేదు అంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యలు చేశారు. పాలన రాకపోతే గడచిన నాలుగేళ్లుగా పన్ను వసూళ్లు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో రహదారులు అన్ని బాగుంటే ఎక్కడో దెబ్బ తిన్న ఒక్క రోడ్డు గురించి మీడియా రాస్తోందని మండిపడ్డారు. గతంలో కంటే మెరుగ్గా రహదారులపై ప్రభుత్వం వ్యయం చేస్తోందన్నారు. ఎప్పుడో ఒకసారి మాత్రమే వేతనాలు ఆలస్యం అయ్యాయి అంతే అని చెప్పుకొచ్చారు. కోవిడ్ కష్టాలు ఉన్నప్పటికీ ఎక్కడా సామాజిక పెన్షన్లు ఆలస్యం కాలేదన్నారు. ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు, యనమల తలో మాట మాట్లాడుతున్నారని.. ఆర్థిక పరిస్థితిపై వారిద్దరితోనూ బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. పథకాలు ఇస్తే ఉచితాలు అంటున్నారని.. టీడీపీ ఇచ్చిన హామీలు ఉచితాలు కావా తమకంటే ఎక్కువ ఇస్తామని ఇప్పుడు చెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

**వాణిజ్య పన్నుల శాఖలోనూ సంస్కరణలు...** బుగ్గన ఇంకా మాట్లాడుతూ... వాణిజ్య పన్నుల శాఖలోనూ చాలా సంస్కరణలు అమలు చేశామని తెలిపారు. ఇన్వర్ట్ పిరమిడ్ తరహాలో పాలన విధానం వాణిజ్య పన్నుల శాఖలో అమలు చేస్తున్నామన్నారు. పారదర్శకంగా నిర్ణయాలు అమలు కావాలనే ఈ సంస్కరణలు అమలు చేస్తున్నామని చెప్పారు. పన్నుల చెల్లింపు రిజిస్ట్రేషన్, ఎన్ఫోర్సుమెంట్, ఆడిట్ లాంటి ప్రక్రియలు వేర్వేరుగా జరిగేట్టు చూస్తున్నామని చెప్పారు. వ్యక్తులపరంగా పొరపాట్లు జరగకూడదని ఈ తరహా విధానం అమలు చేశామన్నారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ టాక్స్ కార్యాలయం ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ట్రేడర్లు, డీలర్లు వెంటపడి పన్నులు కట్టించడం కంటే వారే స్వయంగా పన్నులు చెల్లించేలా చేస్తున్నామని తెలిపారు. రోడ్లపై వేధించే చర్యలు ఎక్కడా లేవన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితేనే తనిఖీలు జరుగుతున్నాయన్నారు. డీలర్లను వేధించే చర్యలు లేవని.. 2022–23లో 28,103 కోట్లు పన్నులు ద్వారా వసూలు అయ్యిందని తెలిపారు. అంతకు ముందు ఏడాది 23,386 కోట్ల రూపాయలు వసూలు అయ్యిందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెల్లడించారు.

# ఛలో గుడివాడకు సీపీఐ పిలుపు.. అడ్డుకున్న పోలీసులు.. అరెస్ట్

విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను వెంటనే కేటాయించాలంటూ చలో గుడివాడకు సీపీఐ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సీపీఐ కార్యాలయం నుంచి గుడివాడకు వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఐ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యగా సీపీఐ కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ సదర్భంగా సీపీఐ నగర్ కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్టీఆర్ జిల్లాతో పాటు విజయవాడ నగరంలో వేలాది మంది టిడ్కో లబ్ధిదారులు చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారని అన్నారు. గుడివాడ మంగళగిరి ప్రజలు చేసిన పుణ్యం ఏమిటి... ఎన్టీఆర్ జిల్లా ప్రజలు చేసిన పాపం ఏంటి అని ప్రశ్నించారు.

ఎన్టీఆర్ జిల్లాలో టిడ్కో లబ్ధిదారులు తమ ఇళ్ళ కోసం నాలుగు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. శాంతియుతంగా తాము గుడివాడ వెళ్లి ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న తమని అడ్డుకోవటం సరైనది కాదన్నారు. విజయవాడ నుంచి జగ్గయ్యపేట వరకు సీపీఐ నాయకులను గృహ నిర్బంధం చేశారని మండిపడ్డారు. గుడివాడలో టిడ్కో ఇళ్లపై ముఖ్యమంత్రి ఒక స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని కోటేశ్వరరావు స్పష్టం చేశారు.

# ఏపీ ఆర్థికస్థితిపై చర్చకు ఎప్పుడో సిద్ధమని చెప్పాం



అమరావతి: రాష్ట్ర ఆర్థికస్థితిపై సీఎం జగన్ మోహన్ రెడ్డి బహిరంగ చర్చకు వస్తే.. తాము సిద్ధమని గతంలోనే చెప్పామని.. దానికి కట్టుబడి ఉన్నామని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఎప్పుడో ఒకసారి బయటకు వచ్చి అడ్డగోలుగా అబద్ధాలు చెప్పి వెళ్లిపోవడం కాదని.. దమ్ముంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. టీడీపీ హయాంలో పెట్టుబడులు, పరిశ్రమల రాకతో ఆదాయం సమకూరితే, ప్రస్తుతం అప్పులపైనే ఆధారపడిన పరిస్థితి అన్నారు. నాడు విభజన సమస్యలు వెంటాడుతున్నప్పటికీ ఐదేళ్లలో చేసిన అప్పు రూ. 1.86 లక్షల కోట్లు మాత్రమే అని.. నేడు జగన్ రెడ్డి నాలుగేళ్లలో చేసిన అప్పు రూ. 7 లక్షల కోట్లని చెప్పుకొచ్చారు. రోజూ ఆర్బీఐ ముందు అప్పుల కోసం మోకరిల్లి రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారన్నారు. మద్యం అమ్మకాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకున్న దిక్కుమాలిన పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని మండిపడ్డారు. వైసీపీ నాయకుల ఆదాయం 200 రెట్లు పెరుగుతూ ఉంటే రాష్ట్ర ప్రజల ఆదాయం మాత్రం తరుగుతూ ఉందన్నారు. రాష్ట్రంలో సహజవనరులు లూటీ అవుతున్నాయని.. పరిశ్రమలు జగన్ రెడ్డి అనుచరులకు, ఆయన బంధువులు, కుటుంబ సభ్యులపరం అవుతున్నాయన్నారు. ఏ రాష్ట్రానికైన ఆర్థిక క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమని.. కానీ, జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ అనే మాటకు అర్థం కూడా తెలియదని యనమల రామకృష్ణుడు వ్యాఖ్యలు చేశారు.




## మణిరత్నం కథానాయిక అవ్వాలని నటినయ్యా!-అదితీరావ్ హైదరీ

భారతీయ సినిమా అనే పవర్ హౌస్ లో భాగమైనందుకు థ్రిల్లింగ్ గా గర్వంగా ఉందని అందాల కథానాయిక అదితీరావ్ హైదరీ అన్నారు. "నేను మణిరత్నం కథానాయికను కావాలనుకున్నాను. అందుకే ..నటిని అయ్యాను" అని కూడా తెలిపారు. ప్రయోగాలు చేస్తూ భాషతో సంబంధం లేకుండా వైవిధ్యమైన పాత్రలను పోషించేందుకు ఆసక్తిగా ఉంటానని తెలిపారు. "నేను ఎప్పుడూ సినిమాని హిందీ తమిళం అని చూడలేదు. నా దృష్టిలో ఏదైనా అద్భుతమైన దర్శకుల కథనం మాత్రమే. ఎవరైనా నటీనటులు సరైన సమయంలో సరైన స్థలంలో ఉన్నట్లయితే అద్భుతమైన దర్శకుల దృష్టిలో



భాగం అవుతారు. మణి సర్ తో నేను చేసిన సినిమా నా జీవితాన్ని అన్ని విధాలుగా మార్చేసింది" అని చెప్పింది. ఆన్ స్క్రీన్ ఇమేజ్ కి దశలు ఉన్నాయని చెప్పిన అదితీరావ్... పనిని ఎంచుకునే విధానంలో ఒక ప్రక్రియ ఉంటుందని తెలిపింది. ముందుగా దర్శకులను ఎంపిక చేసుకుంటాను. స్క్రిప్ట్ ను నాకు ఆఫర్ చేసిన పాత్రను చూస్తాను. అన్నీ కుదిరితే ఆ పాత్రను ఎంపిక చేసుకుంటాను. నేను ఎంపికల విషయంలో జానర్ లేదా భాషని చూడను. ఎంచుకునే దర్శకుడు.. కథను అనుసరించి దశలవారీగా ముందుకు వెళతామని కొంతవరకూ టైప్ కాస్టింగ్ జరుగుతుందని నేను నమ్ముతున్నాను. దర్శకులు తారల్ని ఒక నిర్దిష్ట మార్గంలో చూస్తారు. ఎక్కువ మంది అలా చూడాలనుకుంటున్నారు లేదా ఎక్కువ మంది దర్శకులు అలా ఉపయోగించుకోవచ్చని భావిస్తాను. ఇది అంత చెడ్డ విషయం అని నేను అనుకోను... అని అదితీ తెలిపారు.

## ఐదు ఫ్లాపులు అయినా తగ్గని అమ్మడి క్రేజ్..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డేని మళ్లీ బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అమ్మడు చేసిన గత ఐదు సినిమాలు నిరాశపరచాయి. అందులో తెలుగు తమిళ సినిమాలు మూడు ఉండగా హిందీ సినిమాలు రెండు ఉన్నాయి. ప్రభాస్ తో రాధే శ్యాం సినిమా భారీ అంచనాలతో వచ్చి ఫ్లాప్ అయ్యింది. ఇక ఆ తర్వాత విజయ్ బీస్ట్ ఆశించిన స్థాయిలో అంచనాలను అందుకోలేదు. ఇక ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన సర్కస్ చరణ్ తో చేసిన ఆచార్య సినిమాలు విఫలమయ్యాయి. ఇక లేటెస్ట్ గా బాలీవుడ్ లో సల్మాన్ తో చేసిన కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమా కూడా అమ్మడికి నిరాశ మిగిల్చింది. బాలీవుడ్ లో హిట్ మేనియా కొనసాగించాలని చూస్తున్న పూజా హెగ్డే కలని కలగానే మిగిలింది. ఐదు ఫ్లాపులు ఉన్నా సరే అమ్మడి క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గట్లేదని చెప్పొచ్చు. ప్రస్తుతం త్రివిక్రమ్ మహేష్ కాంబో సినిమాలో పూజా నటిస్తుంది. ఇదే కాకుండా మరో స్టార్ హీరో సినిమాలో కూడా పూజా బేబీ ఛాన్స్ అందుకుందట. స్టార్ సినిమాల్లో ఫలితాలతో



సంబంధం లేకుండా అమ్మడు ఛాన్స్ లు అందుకుంటుంది. కెరీర్ మొదట్లో కూడా పూజా హెగ్డేకి మొదట ఫ్లాపులే పలకరించాయి. కానీ అల్లు అర్జున్ దువ్వాడ జగన్నాథం సినిమాతో అమ్మడి రేంజ్ మారిపోయింది. అంతకుముందు గ్లామర్ షో విషయంలో ఆలోచించిన పూజా డీజేలో తన గ్లామర్ షోకే ప్రేక్షకులు పడిపోయారన్న రీజన్ తో అమ్మడు వరుస సినిమాల్లో గ్లామర్ షో చేస్తూ వస్తుంది. పూజా థై షోకి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడు సినిమాలో ఉంది అంటే తొడల అందాల ప్రదర్శన చాలా కామన్ అనిపించేలా చేసింది. ఆ గ్లామర్ షో వల్లే అమ్మడికి సినిమాల రిజల్ట్ తో తేడా లేకుండా ఛాన్స్ లు వస్తున్నాయి. ఏది ఏమైనా ఒకటి రెండు ఫ్లాపులు పడితేనే అడ్రస్ లేకుండా పోతున్న హీరోయిన్స్ ఉండగా పూజా హెగ్డే మాత్రం హిట్లు వస్తున్నా మళ్లీ అవకాశాలను మాత్రం అందుకుంటూ ఫాం కొనసాగిస్తుంది. మహేష్ 28వ సినిమా హిట్ అయితే అమ్మడు మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చినట్టే.

## థైస్ అందాలతో మత్తెక్కిస్తున్న 'పైసా' బ్యూటీ



నాని హీరోగా నటించిన పైసా సినిమా లో హీరోయిన్ గా నటించి మెప్పించిన ముద్దుగుమ్మ సిద్ధికా శర్మ ఆశించిన స్థాయిలో సక్సెస్ లను సొంతం చేసుకోవడం లో విఫలం అయ్యింది. కానీ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ ఆకట్టుకుంటూ ఉంది.

సిద్ధికా శర్మ తాజా ఫోటోలు మత్తెక్కిస్తున్నాయి. థైస్ అందాలతో బోటమ్ యాంగిల్ లో ఈ అమ్మడు ఫోటోలకు ఫోజ్ ఇచ్చి ఆకట్టుకుంది. గతంలో పలు సార్లు ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలు షేర్ చేసింది... కానీ ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఆకట్టుకుంది. ఇక ఈమె సినీ కెరీర్ విషయానికి వస్తే గత సంవత్సరం నుండి బిజీ అయ్యింది. కెరీర్ ఆరంభంలో ఆకట్టుకోలేక పోయిన ఈ అమ్మడు ఇప్పుడు మాత్రం వరుస సినిమాల్లో నటిస్తోంది. ఈ ఏడాది ఈమె నుండి కనీసం మూడు సినిమాలు అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం చేస్తున్న సినిమాలు మాత్రమే కాకుండా ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని తెలుస్తోంది. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తే తప్పకుండా ముందు ముందు ఈమె మరిన్ని ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## సాగరకన్యలా దివి పరువాలు.. స్టన్నింగ్ లుక్స్!



బిగ్ బాస్ తో ఫేమస్ అయ్యింది నటి దివి. అంతక ముందు కూడా పలు సినిమాల్లో నటించినప్పటికీ పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ ఎప్పుడైతే బిగ్ బాస్ కి వెళ్లిందో ఆమె అందానికి ప్రేక్షకులు ముగ్ధులైపోయారు. అప్పటి నుంచి ఆమెకు సోషల్ మీడియాలో క్రేజ్ మరింత పెరిగిపోయింది. ఆ తర్వాత పాపకు సినిమా ఛాన్స్ లు కూడా పెరిగాయనే చెప్పొచ్చు. స్టార్ హీరోలో సినిమాల్లో చిన్న చిన్న రోల్స్ చేస్తోంది. ఇటీవల చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమాలో దివికి మంచి పాత్రే దక్కిందని చెప్పాలి. ఇటీవల పుష్ప2 లోనూ రిపోర్ట్ గా కనిపించనుంది. ఇటీవల రిలీజ్ చేసిన టీజర్ లో అలా తళుక్కున మెరిసింది. ఇలా పలు సినిమాల్లో ఛాన్స్ లు దక్కించుకుంటూ క్రేజ్ పెంచుకుంటోంది. ఈ అమ్మడుకి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలోనే క్రేజ్ ఎక్కువ అని చెప్పాలి. ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసిందంటే చాలు వైరల్ అయిపోవాల్సిందే. ఎప్పటికప్పుడు హాటు హాటు ఫోజులతో సోషల్ మీడియాను షేక్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ హాట్ బ్యూటీ తన పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ కాస్ట్యూమ్ లో మెరిసింది. సాగరకన్యలా ముస్తాబై ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూసి కుర్రాళ్లు గుండెలు జారిపోయాయి. పోస్టు చేసిన కొద్ది గంటలకే వేలల్లో లైకులు రాగా కామెంట్ల వర్షం కురుస్తోంది. దివి సూపర్ హాట్ క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఆమె పుట్టినరోజు కూడా కావడంతో హ్యాపీ బర్త్ డే అంటూ కూడా విషెస్ తెలియజేస్తున్నారు. నిజానికి ఈ బ్యూటీది హైదరాబాదే. మొదట మోడల్ గా కెరీర్ ప్రారంభించింది. ఇప్పుడు చిన్న చిన్నగా సినిమాల్లోకి అడుగుపెడుతోంది. నెమ్మదిగా ప్రేక్షకులకు చేరువ అవుతోంది. త్వరలోనే ఈ బ్యూటీకి మరింత మంచి ఛాన్స్ లు రావాలని ఆమె ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. ఇక మెగాస్టార్ భోళా శంకర్ లో అమ్మడు ఒక పాత్రలో నటిస్తోంది. మరి ఆ రోల్ అనంతరం కెరీర్ యూ టర్న్ తీసుకుంటుందో లేదో చూడాలి.

## పదహారేళ్ల వయసు పడి పడి లేచే మనసు


స్వచ్ఛమైన .. కలతలు.. గందరగోళం లేని వయసు ఏది? అంటే కచ్చితంగా టీనేజీనే. ఈ ఏజ్ ని గోల్డెన్ ఏజ్ తో పోలుస్తారు. ఇంతకీ టీనేజీలో సమంత ఎలా ఉండేది? ఏ మాయ చేశావే సమయానికి టీనేజీ దాటి ఇరవైల్లో అడుగుపెట్టింది. కానీ అంతకుముందు అంటే పదహారేళ్ల వయసులో ఎలా ఉండేదో చూసే భాగ్యం ఇన్నాళ్లు కలగలేదు. ఎట్టకేలకు ఆ కోరిక నెరవేరింది. తాజాగా సమంతా రూత్ ప్రభు తన 16 సంవత్సరాల వయస్సులో దిగిన త్రోబాక్ ఫోటోని ఇన్ స్టాలో షేర్ చేయగా అది వైరల్ గా మారింది. టీనేజీ మిసమిసల సామ్ ఎంతో ముగ్ధ మనోహరంగా సుకుమారంగా కనిపిస్తోంది ఈ ఫోటోలో. మెమరీ లేన్ లో విహరించి తన ఫోన్ మెమరీ నుండి ఈ క్లాసిక్ ఫోటోని వెలికితీసి 16 ఏళ్ల నేను అని



క్యాప్షన్ ఇచ్చారు. అందమైన డ్రెస్.. మెడలో పూసల దండలతో బోల్డ్ అప్పియరెన్స్.. సామ్ అమాయకమైన మోము తన అందాన్ని రెట్టింపు చేసింది. అలాగే ఈ ఫోటోలో మేకప్ గ్లిజ్ లేకుండా సమంత ఎంతో నేచురల్ గా కనిపిస్తోంది. సమంత కెరీర్ మ్యాటర్ కి వస్తే తన కెరీర్ లోనే సిటాడెల్ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సిరీస్. ప్రియాంక చోప్రా జోనాస్ సిరీస్ సిటాడెల్ ఆంగ్ల వెర్షన్ లో నటించగా.. భారతీయ వెర్షన్ లో సమంత నటించింది. వరుణ్ ధావన్ కథానాయకుడు కాగా రాజ్ అండ్ డికె ఈ సిరీస్ ని తెరకెక్కిస్తున్నారు. ది ఫ్యామిలీ మ్యాన్ మేకర్స్ తో సామ్ రెండవ సహకారమిది. సామ్ నటించిన శాకుంతలం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచింది. అయినా జయాపజయాలతో సంబంధం లేకుండా సమంత తన కెరీర్ రన్ కొనసాగిస్తోంది. తదుపరి డౌన్ టౌన్ అబ్బే సృష్టికర్త ఫిలిప్ జాన్ తో కలిసి అరేంజ్ మెంట్స్ ఆఫ్ లవ్ పేరుతో ఒక పోర్జెక్ట్ లో నటించేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్ట్ వివరాలు మరిన్ని వెల్లడి కావాల్సి ఉంది. అలాగే డిటెక్టివ్ ఏజెన్సీని నడిపించే యువతిగా డబుల్ రోల్ లోను నటించింది. ఏప్రిల్ 28న సమంత పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అందే ప్రత్యేక కానుక ఏమిటో వేచి చూడాల్సిందే.

## తాడో పేడో తేల్చుకోబోతున్న పాయల్?

కొన్నేళ్ల కిందట 'ఆర్ఎక్స్ 100' అనే చిన్న సినిమా రేపిన సంచలనం అంతా ఇంతా కాదు. చిన్న సినిమాగా విడుదలై భారీ విజయం సాధించడంతో ఆ సినిమాలో భాగమైన అందరికీ మంచి పేరే వచ్చింది. అవకాశాలు వెల్లువెత్తాయి. హీరో కార్తికేయ వరుసబెట్టి సినిమాలు చేసేశాడు. హీరోగానే కాక విలన్గానూ నటించాడు. హీరోయిన్ పాయల్ రాజ్పుత్ సైతం బాగానే అవకాశాలు అందుకుంది. కానీ కార్తికేయ కొన్ని ఛాన్సులైనా ఉపయోగించుకున్నాడు కానీ.. పాయల్ కు మాత్రం తనకు వచ్చిన క్రేజ్ను ఏమాత్రం ఉపయోగించుకోలేకపోయింది. రెండంకెల సంఖ్యలో సినిమాలైతే చేసింది



కానీ.. ఒక్కటంటే ఒక్కటీ సరైన ఫలితాన్నివ్వలేదు. అగ్ర కథానాయకులు వెంకటేష్ రవితేజల సరసన నటించిన 'వెంకీ మామ' 'డిస్కో రాజా' చిత్రాలు సైతం ఆమె కెరీర్ కు ఎంతమాత్రం ఉపయోగపడలేదు. దీంతో చూస్తుండగానే ఫేడవుట్ అయిపోయింది పాయల్. ఇక పాయల్ కెరీర్ ముగిసిందనుకున్న తరుణంలో మళ్లీ ఆమెకు లైఫ్ ఇవ్వడానికి 'ఆర్ఎక్స్ 100' దర్శకుడు అజయ్ భూపతినే రంగంలోకి దిగాడు. తన రెండో సినిమా 'మహాసముద్రం'తో చేదు అనుభవం ఎదుర్కొన్న అజయ్.. తిరిగి తన రూట్లోకి వెళ్లిపోయాడు. స్టార్లను నమ్ముకోకుండా 'ఆర్ఎక్స్ 100' తరహాలో చిన్న నటీనటులతో కాన్సెప్ట్ బేస్ట్ మూవీ చేయడానికి సిద్ధమయ్యాడు. ఆ ప్రయత్నంలోనే 'మంగళవారం' అనే వెరైటీ సినిమా చేస్తున్నాడు. పాయల్ పనైపోయిందని జనాలు అనుకున్నప్పటికీ.. అతను ఆమెనే లీడ్ రోల్ కోసం తీసుకున్నాడు. 'ఆర్ఎక్స్ 100'లో కంటే బోల్డా సెన్సేషనల్గా పాయల్ పాత్రను అతను తీర్చిదిద్దాడని 'మంగళవారం' ఫస్ట్ లుక్ చూస్తే అర్థమైపోతుంది. పాయల్ కూడా ఈ సినిమాతో తాడో పేడో తేల్చుకుందాం అన్నట్లుగా అజయ్ ఎలా కోరుకుంటే అలా కనిపించడానికి నటించడానికి రెడీ అయినట్లుంది. ఈ సినిమా క్లిక్ అయితే పాయల్ మళ్లీ బిజీ కావచ్చు. లేదంటే ఆమె కెరీర్కు తెరపడవచ్చు.




# పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లో చేరికపై స్పష్టత..!

పొంగులేటి, జూపల్లి.. ఈ పేర్లు గత రెండు, మూడు నెలలుగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. ఈ ఇద్దరి భవిష్యత్ కార్యాచరణపై ప్రకటన ఎప్పుడు ఉంటుంది..? ఏ పార్టీలో చేరబోతున్నారు..? అనేదానిపైనే చర్చ జరుగుతూనే ఉంది. అయితే కాంగ్రెస్‌లో చేరాలని ఇద్దరూ ఫిక్స్ కావడం, ఆ పార్టీ కీలక నేతలతో వరుస సమావేశాలు కావడంతో చేరిక ఒక్కటే మిగిలుందని అంతా అనుకున్నారు కానీ అధికారిక ప్రకటన వచ్చినప్పటికీ ఎందుకో ఆలస్యమైంది. అసలే ఆలస్యం అంటే.. దీనికి తోడు ఇంకా సమాలోచనలు చేస్తూ ఉండిపోయారు. దీంతో ఎందుకు ఇంకా పొంగులేటి, జూపల్లి వెనకడుగేస్తున్నారు..? మళ్లీ ఏమైనా మనసు మార్చుకున్నారా..? లేకుంటే ఇంకేమైనా జరిగిందా..? అని నేతలు, కార్యకర్తలు, వీరాభిమానులు ఆలోచనలో పడ్డారు. ఈ అనుమానాలన్నింటికీ శుక్రవారం నాటితో ఫుల్ క్లారిటీ వచ్చేసింది. అంతేకాదు.. ముహూర్తం కూడా నేతలు ఫిక్స్ చేసుకున్నారు. బీఆర్ఎస్ బహిష్కృత నేతలు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరికపై ఫుల్ క్లారిటీ వచ్చేసింది. ఈ నెలాఖరున పొంగులేటి, జూపల్లితో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం అమెరికా పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. యువనేత పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ఈ చేరికలు ఉంటాయని రాష్ట్ర అధిష్టానం స్పష్టం చేసింది. ఈ నెల 22న అమెరికా నుంచి రాహుల్ ఢిల్లీ రానున్నారు. అయితే.. ఢిల్లీలో కాకుండా ఖమ్మంలో భారీ బహిరంగ సభ పెట్టి పొంగులేటి చేరబోతున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ కీలక నేతలు క్లారిటీ ఇచ్చేశారు. మరోవైపు.. నాగర్ కర్నూల్ వేదికగా జరిగే సభలో జూపల్లి, దామోదర్ రెడ్డి.. రాహుల్ సమక్షంలో కండువాలు కప్పుకోనున్నారు. మొత్తానికి చూస్తే.. కాంగ్రెస్‌లో చేరుతున్నారని నేతలిద్దరూ.. అటు పార్టీలోని కీలక నేతలు క్లారిటీ ఇచ్చేశారు. అయితే ఖమ్మం, నాగర్ కర్నూలులో సభలు ఎప్పుడనే విషయంపై మాత్రం క్లారిటీ రావట్లేదు. రాహుల్ అమెరికా పర్యటన ఉన్నారు కాబట్టే జూపల్లి, పొంగులేటి చేరిక ఆలస్యమైందన్న మాట.

**నంబర్ పెరుగుతూనే ఉంది..! :** బీఆర్ఎస్ అధిష్ఠానం పట్ల అసంతృప్తిని తొలుత పొంగులేటి ఒక్కరే ప్రకటించగా.. నెల రోజుల క్రితం ఆయనకు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తోడయ్యారు. జూపల్లి కలిశాక తాము ఎటువైపు వెళ్లాలన్నదానిపై ఇద్దరి మధ్య అంతర్గత సమావేశాలు జరిగాయి. అదే సమయంలో ఇద్దరూ కలిసి పలువురు నేతలతో రహస్యంగా సమావేశాలు నిర్వహించారు. వారం రోజుల క్రితం వీరికి బీఆర్ఎస్‌కే చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి జత కలిశారు. దీంతో ఇద్దరు కాస్త ముగ్గురయ్యారు. ఈ మధ్యే సీఎం కేసీఆర్ అత్యంత సన్నిహితుడు శ్రీహరి రావు కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి ఎల్లుండి (జూన్–18న) కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. రోజురోజుకూ తెలంగాణ కాంగ్రెస్‌లో చేరే నేతల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. మొత్తానికి చూస్తే.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మంచిరోజులు వస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికల సీజన్ ఇంకా పూర్తిగా మొదలవ్వకుండానే చేరికలు ఈ రేంజ్‌లో ఉన్నాయంటే.. ఇంకా ఎన్నికలు సమీపిస్తే మరిన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఏం జరుగుతుందో చూడాలి మరి.

# అధికారులు ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకే వార్డు పరిపాలన: మంత్రి కేటీఆర్




హైదరాబాద్: జీహెచ్ఎంసీ తన స్వరూపాన్ని మరోసారి మార్చుకోనున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. నేటి నుంచి సరికొత్త పాలన అందుబాటులోకి వస్తున్నదని చెప్పారు. జీహెచ్ఎంసీలో వార్డు కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పౌర సమస్యల పరిష్కారంలో నగర వాసులకు మరింతగా చేరువయ్యేందుకు ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేసిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. కాచిగూడలో వార్డు కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వార్డు అధికారితోపాటు మొత్తంగా వార్డులో 10 మంది చొప్పున 150 వార్డులలో 1500 మంది అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండనున్నారు. దీంతో ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతాయని చెప్పారు. సమస్యలు ఎంత సమయంలో పరిష్కారం చేయాలనే సిటిజన్ చార్టర్?ను కూడా వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగుపెడుతున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 4 కోట్ల జనాభా ఉన్నదని, అందులో హైదరాబాద్‌లోనే కోటి మందికిపైగా ఉన్నారని తెలిపారు. నగరంలో జనసాంద్రత చాలా ఎక్కువని చెప్పారు. కోటి మందికి సేవలు అందించేందుకు క్షేత్రస్థాయికి పాలనను విస్తరించామన్నారు. అధికారులు ప్రజలకు మరింత చేరువగా ఉండాలని వార్డు పరిపాలన తీసుకొచ్చాని వెల్లడించారు. గ్రామాలలో పంచాయతీ సెక్రెటరీ, ఇతర సిబ్బంది ఉంటారని, చిన్న చిన్న మున్సిపాలిటీలలో వార్డుకొక ఆఫీసర్ ఉంటారని చెప్పారు. మరి కోటికి పైగా జనాభా ఉన్న జీహెచ్ఎంసీలో 35,000 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. అందుకోసమే వార్డు కార్యాలయాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రతి వార్డుకు పది మంది సిబ్బంది ఉంటారు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి వార్డుకు నేతృత్వం వహిస్తారని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం సర్కిల్ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం సమయాన్ని కూడా ఇచ్చామని తెలిపారు. అందుకోసం సిటిజన్ చార్టర్ ఇచ్చామని చెప్పారు. జవాబు దారితనం, సుపరిపాలన కోసం వార్డు కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే రాజకీయాలకతీతంగా పనిచేయాలని సూచించారు. వ్యక్తులు అశాశ్వతమనీ వ్యవస్థ శాశ్వతమని చెప్పారు. దేశం మొత్తం మనవైపు చూస్తుందని, ఎవరు వచ్చి ఫిర్యాదు ఇచ్చినా తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యవస్థను ఉపయోగించుకోవాలన్నారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ వార్డు కార్యాలయాలను మానిటర్ చేయాలని మంత్రి కేటీఆర్ అన్నారు.

## తూముకుంట ఆలయ భూముల వివాదంలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ : హైదరాబాద్‌లోని తూముకుంట ఆలయ భూముల వివాదంలో మంత్రి మల్లారెడ్డి చిక్కుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి కేటాయించిన స్థలంలో మంత్రి మల్లారెడ్డి కబ్జాకు యత్నించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 9 ఎకరాల్లో వేంకటేశ్వర స్వామికి ఆలయానికి కేటాయించిన స్థలంలో మల్లన్న టెంపుల్



నిర్మాణానికి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయ భూముల్లో మల్లన్న ఆలయం ఎలా కడతారంటూ అర్చకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ భూములను కబ్జా చేసేందుకు మంత్రి మల్లారెడ్డి యత్నిస్తున్నారంటూ అర్చకులు ఆరోపిస్తున్నారు. మల్లన్న ఆలయం నిర్మాణం పేరుతో దౌర్జన్యంగా వేంకటేశ్వర స్వామి ఆలయ భూములు తీసుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కేటీఆర్ ముందే వర్గాలుగా విడిపోయిన బీఆర్ఎస్ నేతలు.. వార్డ్ ప్రారంభోత్సవ కార్యక్రమం రచ్చ రచ్చ

హైదరాబాద్ : కాచిగూడ వార్డు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం రసాభాసగా మారింది. మంత్రి కేటీఆర్ ముందే బీఆర్ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ కార్యకర్తలు మూడు వర్గాలుగా విడిపోయారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్ పేట్ నియోజకవర్గ



ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి, గోల్నాక కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్ గౌడ్ వర్గీయులు పరస్పర నినాదాలు చేసుకున్నారు.

దళిత బంధులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ కేటీఆర్‌కు ఎడ్ల సుధాకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎంటరై పరిస్థితిని అదుపు చేశారు.

## హరగోపాల్‌పై కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నా

న్యూఢిల్లీ: ప్రొఫెసర్ హరగోపాల్‌పై దేశ ద్రోహం కేసు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని.. అయితే హరగోపాల్ ఒక ప్రొఫెసర్ ఆయనకు ఎవరితో సంబంధాలు లేవని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. హరగోపాల్‌పై కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వ్యక్తి హరగోపాల్ అని అన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ జోక్యం చేసుకొని హరగోపాల్‌పై ఎలాంటి కేసు లేకుండా చూడాలన్నారు. కేసీఆర్‌ను ఉద్యమ ద్రోహిగా చూడాల్సి ఉంటుందన్నారు. వరవరరావుపై కూడా ఇలానే దేశద్రోహం కేసు పెట్టారని.. ఆయనను జైల్లో వేశారని మండిపడ్డారు.

చిత్తశుద్ధి ఉంటే బీహార్‌లో జరిగే విపక్షాల మీటింగ్ కేసీఆర్, జగన్, చంద్రబాబు నాయుడు హాజరుకావాలన్నారు. గవర్నర్ తమిళ్ సై సౌందర్ రాజన్ పుదుచ్చేరిలో మహిళలకు పబ్బులకు పర్మిషన్ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవానికి



ఆహ్వానం రాలేదని గవర్నర్ అన్నారని.. మరి పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదు అంటే గవర్నర్ దగ్గర సమాధానం లేదన్నారు. ఏదో జగన్ ప్రభుత్వంపై బీజేపీ మాట్లాడాలి కాబట్టి మాట్లాడారన్నారు.

మోడీ ప్రభుత్వానికి జగన్ కట్టుబానిస ఆయనను ఎందుకు వదులుకుంటారని ప్రశ్నించారు. సీపీఐ వచ్చే ఎన్నికల్లో ఎవరితో వెళ్లాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని నారాయణ పేర్కొన్నారు.




అహ్మదాబాద్: అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపోర్‌జాయ్ తుపాను గురువారం అర్ధరాత్రి తర్వాత గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో తీరాన్ని దాటింది. ప్రస్తుతం తీవ్ర తుపానుగా బలహీనపడిన బిపోర్‌జాయ్ ఈశాన్య దిశగా కరాచీ వైపు కదులుతోంది. ఈ సాయంత్రానికి వాయుగుండంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే, తీరాన్ని దాటే సమయంలో ఈ తుపాను గుజరాత్‌లో అల్లకల్లోలం సృష్టించింది. 140 కి.మీల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. స్తంభాలు కూలిపోయి వందలాది గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆకస్మిక వరదలతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. తుపాను ప్రభావంతో కచ్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. మాండ్విలోని పలు ప్రాంతాల్లో నివాస సముదాయాలు, ఆసుపత్రుల్లోకి వరదనీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీర ప్రాంతాల్లోని దాదాపు 940 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై చెట్లు కూలాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. రైళ్ల రద్దు..: తుపాను ప్రభావంతో పశ్చిమ రైల్వే పలు సర్వీసులను రద్దు చేసింది. అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తుండగా కొన్నింటి ప్రయాణాన్ని కుదించారు. భావ్‌నగర్‌లో వరదనీటిలో చిక్కుకున్న మేకలను కాపాడేందుకు వెళ్లి తండ్రీకొడుకులు ప్రాణాలు కోల్పోయారు. పలు చోట్ల 23 మంది గాయపడ్డారు. 24 పశువులు మృతిచెందాయి. సీఎంకు ప్రధాని ఫోన్: వరద పరిస్థితుల దృష్ట్యా ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో ఫోన్లో మాట్లాడారు. తుపాను పరిస్థితుల గురించి ఆరా తీశారు. గిర్ అడవుల్లో వన్యప్రాణుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు కేంద్రం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సాయంత్రానికి రాజస్థాన్‌లోనూ తుపాను ప్రభావం కన్పించనుంది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో బర్మేర్ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అటు ముంబయిలోనూ తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది.




ఉత్తర కొరియా ప్రయోగించిన రాకెట్ శకలాలు దక్షిణ కొరియాకు దొరికాయి. గత నెల ఉ.కొరియా ఓ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపేందుకు ప్రయత్నించగా.. అది విఫలమైంది. అప్పట్లో ఆ రాకెట్, ఉపగ్రహ శకలాలు దక్షిణ కొరియా వద్ద సముద్రంలో కూలిపోయాయి. వీటిని గురువారం సాయంత్రం వేళ దక్షిణ కొరియా సైన్యం సముద్రం నుంచి వెలికి తీసింది. ఈ విషయాన్ని ఆ దేశ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ శుక్రవారం వెల్లడించారు.

కీలకమైన ఉపగ్రహ శకలాల కోసం గాలింపు చేపట్టామని వెల్లడించారు. ఉ.కొరియా ప్రయోగం మధ్యలోనే విఫలమై.. శకలాలు దక్షిణ కొరియా పశ్చిమ తీరంలో కూలిపోయాయి. దీంతో వెంటనే సియోల్ బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ శకలాలను సేకరించి ఉత్తరకొరియా వాడుతున్న టెక్నాలజీని దక్షిణ కొరియా అంచనా వేయనుంది. ఇప్పటి వరకు చోన్మా (రెక్కల గుర్రం) అని రాసి ఉన్న ఓ భారీ సిలిండర్ వంటి వస్తువును స్వాధీనం చేసుకొన్నారు. ఈ ప్రయోగానికి ఉపయోగించిన రాకెట్ పేరు చొల్లిమా–1గా గుర్తించారు. ఈ విషయాన్ని ద.కొరియా ఏజెన్సీ ఫర్ డిఫెన్స్ డెవలప్‌మెంట్ పేర్కొంది. ఈ పరికరాలు రాకెట్ రెండో దశకు చెందినవిగా భావిస్తున్నామని ఆ దేశ రక్షణ మంత్రి లీ జోంగ్ సుప్ పేర్కొన్నారు. ఉ.కొరియా పెంపొందించుకుంటున్న సాంకేతికతపై గతంలోనే సరిహద్దు దేశాలు దక్షిణ కొరియా, జపాన్ ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రయోగ సమయంలో ద.కొరియా రాజధాని సియోల్‌లో గందరగోళం ఏర్పడింది. ప్రజలకు అత్యవసర సందేశాలు పంపించారు. మరోవైపు చైనా యుద్ధ నౌక కూడా రాకెట్ కూలిన ప్రదేశానికి సమీపంలో శకలాల కోసం గాలింపు చేపట్టడం విశేషం. చైనా ఇలా పరాయి దేశాల సాంకేతికతను సంపాదించడం కోసం గాలింపులు చేపట్టడం కొత్తకాదు. ఎఫ్–117 అనే అత్యాధునిక అమెరికా స్టెల్త్ విమానం 1999లో సెర్బియాలో కూలిపోయింది. ఆ విమాన శకలాలను చైనా సంపాదించి.. తాజాగా జే–20 స్టెల్త్ జెట్‌ను తయారు చేసింది. తాజాగా ఉ.కొరియా రాకెట్ శకలాలను విశ్లేషించి.. దాని సాంకేతికతను తెలుసుకునే పనిలో దక్షిణ కొరియా ఉంది.

# జీహెచ్ఎంసీ సరికొత్త పాలనకు శ్రీకారం..

## కాచిగూడలో వార్డు కార్యాలయం ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యద్భుత వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. పౌర సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. కాచీగూడలో వార్డు ఆఫీసును మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. జీహెచ్ఎంసీలో 150 డివిజన్లలో మంత్రులు, మేయర్, అధికారులు ప్రారంభించనున్నారు. ఒక్కో వార్డులో 10 మంది అధికారులు అందుబాటులో ఉంటారు. పారిశుద్ధ్యం, విద్యుత్, టౌన్‌ప్లానింగ్ వంటి వాటిపై ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించనున్నారు. పురపాలనలో మరో సంస్కరణకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. వికేంద్రీకరణ, ప్రజలు కేంద్రంగా పాలనే తమ లక్ష్మని చెప్పారు. వార్డు కార్యాలయాల్లోనే కనీస పౌరసేవలు, ఫిర్యాదులు పరిష్కారమవుతాయన్నారు. సిటిన్ చార్టర్‌కు అనుగుణంగా



ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి డివిజన్ కార్యాలయంలో 10 మంది అధికారుల బృందం ఉంటుందని, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ట్విట్టర్ వేదికగా తెలిపారు.




**భారాసలో ప్రస్తుత సీఎం, కాబోయే సీఎం ఇద్దరూ ఉన్నారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి అయ్యేందుకు కేటీఆర్ సిద్ధంగా ఉన్నారన్నారు. గొంగలి పురుగులా ఉన్న ఖమ్మం పట్టణాన్ని సీతాకోక చిలుకలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని వివరించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని పట్టణ ప్రగతి దినోత్సవాల్లో భాగంగా ఖమ్మంలో చేపట్టిన ర్యాలీలో మంత్రి అజయ్ పాల్గొన్నారు.**

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com